సూర్య
18వ వసంతంలోకి
www.suryaa.com
ఎన్టీఆర్ - కృష్ణా
బుధవారం 12 ఫిబ్రవరి 2025
పేజీలు 8

బర్డ్స్ ఫ్లూ వ్యాధి పట్ల..

# అప్రమత్తంగా ఉండాలి



- వ్యాధి మానవులకు వచ్చే ప్రమాదం ఉంది.
- గోదావరి జిల్లాల నుండి వచ్చే కోడిగుడ్లను మధ్యాహ్న భోజన పథకంలో ఉపయోగించవద్దు
- సరిహద్దు జిల్లాల నుండి వచ్చే కోళ్లు, మాంసం, గుడ్ల పై గట్టి నిఘా ఉంచండి
- జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

వివరాలు 2లో...

పది పరీక్షల నిర్వహణకు..

# పకడ్బందీ ఏర్పాటు

- వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- ప్రతి విషయంలోనూ అత్యంత అప్రమత్తంగా ఉండాలి
- జిల్లాలో 31,231 మంది విద్యార్థులకు 168 పరీక్షా కేంద్రాలు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 11, మేజర్ న్యూస్:** మార్చి 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న 10వ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సమన్వయ శాఖల అధికారులను



ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో పదో తరగతి పరీక్షల నిర్వహణపై పాఠశాల విద్య, మిగతా 2లో



నవోదయం 2.0తో

సారా రహిత రాష్ట్రంగా

# ఏపీని తయారు చేస్తాం

- 2019-24 మధ్య డిపోలను తాకట్టు పెట్టి అప్పులు తెచ్చారు
- తప్పుడు కథనాలపై మంత్రి కొల్లు రవీంద్ర సీరియస్

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మద్యం షాపుల కేటాయింపు నుండి బ్రాండ్ల పునరుద్ధరణ వరకు అత్యంత పారదర్శకంగా అమలు చేయడం చూసి జగన్ రెడ్డి, అండ్ కో ఓర్వలేక పిచ్చి ప్రేలాపణలకు పోతోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సచివాలయంలోని నాలుగో బ్లాక్ పబ్లిసిటీ సెల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో పారదర్శకంగా అమలవుతున్న మద్యం విధానంపై వైసీపీ నేతలు విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 2019-24 మధ్య కాలంలో రాష్ట్రంలో మద్యం విధానాన్ని ఏ విధంగా భ్రష్టు పట్టించారో, ఎంతలా దోచుకున్నారో, కల్తీ మద్యంతో ఎంత మంది ప్రాణాలను హరించారో రాష్ట్ర ప్రజలంతా చూశారన్నారు. నాటి పరిణామాలను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం మద్యం పాలసీని అత్యంత పారదర్శకంగా అమలు చేసిందన్నారు. ఏకంగా 90వేల దరఖాస్తులు, రూ.1800 కోట్ల వరకు ఆదాయం ప్రభుత్వానికి వచ్చిందన్నారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని జిల్లా కలెక్టర్ల సమక్షంలో నిర్వహించి పారదర్శకంగా షాపులు మిగతా 2లో...

# పాఠశాలల భవితవ్యం ప్రశ్నార్థకం?

- పట్టుమని విద్యార్థులు 10 మంది లేరు
- గుడ్లవల్లేరు మండలంలో 15 వరకు పాఠశాలలు

వివరాలు 7లో






# యువతా.. దేశ భవిష్యత్తు మీ చేతుల్లోనే..

- రహదారి భద్రత అందరి బాధ్యతగా గుర్తించి ముందడుగు వేయాలి
- ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి
- భద్రమైన సమాజానికి సురక్షిత రహదారులు కీలకం
- రహదారి భద్రత మాసోత్సవాల్లో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

2లో



# బర్డ్స్ ఫ్లూ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** బర్డ్స్ ఫ్లూ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి, వ్యాధి జిల్లాలో ప్రబలకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు.సరిహద్దు జిల్లాలలో బర్డ్స్ ఫ్లూ వ్యాధి ప్రబలుతున్న నేపథ్యంలో జిల్లాలో ఈ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రెవెన్యూ, పోలీస్, పశుసంవర్ధక, రవాణా, వైద్య ఆరోగ్యశాఖల అధికారులతో మంగళవారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బర్డ్ ఫ్లూ వ్యాధి వైరస్ వల్ల వస్తుంద ని తొలుత కోళ్లకు, అనంతరం మనుషులకు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఇటీవల ఉభయ తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలలో బర్డ్ ఫ్లూ వ్యాధి శాంపిల్స్ నిర్ధారణలో పాజిటివ్ లక్షణాలు వచ్చాయని తక్షణమే ఆయా జిల్లాల యంత్రాంగం అన్ని రక్షణ చర్యలు తీసుకుందన్నారు. ఇతర జిల్లాల నుండి వాహనాల రాకపోకలు లేకుండా చేశారన్నారు. పది కిలోమీటర్ల వరకు సర్వే లెన్స్ చేశారన్నారు.మన పొరుగు జిల్లా లలో బర్డ్ ఫ్లూ వ్యాధి ఉంది కాబట్టి ఆ జిల్లాల నుండి కోళ్ళు, గుడ్లు రాకుండా గట్టి నిఘా ఉంచాలన్నారు. వ్యాపారస్తులు కూడా తక్కువ ధరకు పక్క జిల్లాలల నుండి తీసుకువచ్చి అమ్మకాలు నిర్వహిస్తారని, ఆ జిల్లాల నుండి వచ్చే గుడ్లు, కోళ్లు, మాంసం ఉత్పత్తులను పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రస్తుతం మన దగ్గర ఉన్న కోళ్ల కి ఎటువంటి ఇబ్బందిలేదని, అయితే వాటిని ఎక్కువ బాయిల్ చేసి తినడం మంచిదన్నారు. ఇతర జిల్లాల నుండి వాటిని మన జిల్లాలోకి రాకుండా గట్టి నిఘా ఉంచాలన్నారు. జిల్లాలోని పశుసంవర్ధక శాఖ అధికారులు, సిబ్బంది జిల్లాలోని అన్ని కోళ్ల ఫామ్స్ లను పరిశీలించి అక్కడ శానిటేషన్, తీసుకుంటున్న రక్షణ చర్యలు, వ్యాక్సినేషన్ ను పరిశీలిస్తున్నారన్నారు. జిల్లాలోని అన్ని కోళ్లకు వాక్సినేషన్ చేసి ప్రొటెక్షన్ లోనే ఉంచామన్నారు. ఎన్ని రక్షణ చర్యలు తీసుకున్నప్పటికీ వైరస్ లోడ్ అయితే ఇబ్బంది ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని ఇతర జిల్లాల నుండి రాకుండా చూడాలన్నారు. ఇందుకు రాపిడ్ రెస్పాన్స్ టీమ్ లవలె సర్వేలెన్స్ టీమ్ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి మండలంలో రెండు నుండి మూడు టీములు ఏర్పాటు చేసి గట్టి నిఘా ఉంచామని,ఎక్కడైనా కోళ్లు చనిపోయి నట్లయితే ఆ రైతులను అప్రమత్తం చేస్తున్నామన్నారు. అగ్రికల్చర్ మార్కెట్ కమిటీల చెక్ పోస్ట్ ల వద్ద పశు సంవర్ధక శాఖ అధికారులు, సిబ్బందిని విధుల్లో ఉంచడం జరిగిందన్నారు. ఇతర జిల్లా నుండి వచ్చే వాటిని పరిశీలించి చెక్ చేసి ఇబ్బంది లేకపోతే వాటిని జిల్లాలో అనుమతిస్తున్నామన్నారు. పశుసంవర్ధక, పోలీస్, రవాణా శాఖ అధికారులు సమన్వయంతో అన్ని చెక్ పోస్ట్ ల వద్ద గట్టి నిఘా ఉంచామని అనుమానం ఉండి సమాచారం అందిస్తే అరగంట లోపే పశుసంవర్ధక శాఖ అధికారులు అక్కడకు వచ్చి జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో చికెన్ షాపుల వారు ఎక్కడ నుంచి కొనుగోలు చేస్తున్నారో దానిని పరిశీలించాలన్నారు. గ్రామపంచాయతీ, మున్సిపల్ అధికారులు వారి పరిధిలోని చికెన్ షాపులను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి అక్కడి శానిటేషన్ ప్రక్రియను పరిశీలించి రక్షణ చర్యలు తీసుకోవడం వల్ల మన జిల్లాలో బర్డ్ ఫ్లూ వ్యాధి రాకుండా అదుపులో ఉంచుకోవచ్చు నన్నారు. వారం పది రోజుల్లో బర్డ్ ఫ్లూ వ్యాధి పూర్తిస్థాయిలో అదుపులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని ఎందుకంటే వాతావరణంలో ఉష్ణోగ్రత స్థాయి పెరగడంతో వైరస్ చనిపోయే అవకాశం ఉందని అన్నారు.మనుషులకు కూడా వచ్చే ప్రమాదం ఉన్నందున ప్రతి ఒక్కరూ చికెన్, గుడ్లను బాగా ఉడికించి తీసుకోవాలని సూచించారు. హోటల్స్, రెస్టారెంట్ లో కూడా పూర్తిగా బాయిల్ చేసిన వాటిని తీసుకోవాలన్నారు. గ్రామాలలో ఫ్లూ లక్షణాలు ఎవరికైనా ఉంటే వారి శాంపిల్స్ తీసి పరీక్షించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను, ఎక్కడైనా పక్షులు చనిపోతే వాటిని పూర్తిగా శానిటేషన్ చేయాలని, చనిపోయిన వాటి సమాచారాన్ని స్థానికంగా ఉండే పశు సంవర్ధక శాఖ అధికారులకు అందించాలని ఆదేశించారు.బర్డ్స్ ఫ్లూ వ్యాధిని ప్రతి ఒక్కరూ సీరియస్ గా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు.జిల్లాలో వ్యాధి ప్రబలకుండా తీసుకుంటున్న జాగ్రత్త చర్యలపై పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ నరసింహులు వివరించారు. గోదావరి జిల్లాల నుండి వచ్చే కోడిగుడ్లను మధ్యాహ్న భోజన పథకంలో ఉపయోగించొద్దని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు.

## పది పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాటు

(మొదటిపేజీ తరువాయి)

రెవెన్యూ, పోలీస్, రవాణా, విద్యుత్, పోస్టల్ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో పదో తరగతి పరీక్షలకు రెగ్యులర్, ఓపెన్ స్కూల్ కలిపి మొత్తం 31,231 మంది హాజరుకానున్నారని, వీరిలో బాలురు 14,212 మంది కాగా బాలికలు 17,019 మంది ఉన్నారని తెలిపారు. జిల్లాలో 168 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది.. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరుగుతాయన్నారు. 25 స్టోరేజ్ పాయింట్లు ఏర్పాటు చేయడం జరిగింది.. అదేవిధంగా 336 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, అయిదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 12 మంది రూట్ అధికారులు, మరో 12 మంది సహాయ రూట్ అధికారులను నియమించాలన్నారు. మొత్తం 1,848 మంది ఇన్విజిలేటర్లు సేవలందించనున్నట్లు వివరించారు. పరీక్షా కేంద్రాలకు మొబైల్ ఫోన్లు, ఏవిధమైన ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను అనుమతించడం జరగదని స్పష్టం చేశారు. పరీక్షలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని.. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, తాగునీరుకు ఇబ్బంది లేకుండా చూడాలని ఓఆర్ఎస్ ప్యాకెట్లను కూడా అందుబాటులో ఉంచాలని సూచించారు. పరీక్ష పత్రాలను సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేర్చడం దగ్గర నుండి జవాబు పత్రాలను తిరిగి పోస్ట్ ఆఫీస్‌కు పంపేవరకు ప్రతి విషయంలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాసేందుకు వీలుగా ఫర్నిచర్, తాగునీరు, విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకొని, పరీక్ష అనంతరం తిరిగి ఇళ్లకు చేరుకునేలా ఆర్‌టీసీ సర్వీసులను రీషెడ్యూల్ చేయాలని ప్రజా రవాణా అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు, పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని వైద్య ఆరోగ్యం, పంచాయితీ, మునిసిపల్ శాఖల అధికారులను ఆదేశించారు. 144 సెక్షన్ అమలు, బందోబస్తు ఏర్పాట్లు, భద్రతా చర్యల విషయంలో పోలీసు శాఖతో సమన్వయం చేసుకోవాలని జిల్లా కలెక్టరు లక్ష్మీశ అధికారులకు సూచించారు. సమావేశంలో డీఈవో యూవీ సుబ్బారావు, విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, ఆర్‌టీవో ఆర్.ప్రవీణ్, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నవోదయం 2.0తో సారా రహిత రాష్ట్రంగా ఏపీని తయారు చేస్తాం



(మొదటిపేజీ తరువాయి)

కేటాయించామన్నారు. తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు మార్జిన్ మొత్తాన్ని 14 శాతానికి పెంచేందుకు నిర్ణయించడాన్ని కూడా వక్రభాష్యాలు చెబుతున్నారని మండిపడ్డారు. ప్రతి బాటిల్‌పై రూ.10లు పెంచుతూ తీసుకున్న నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాకు నష్టం అనే వార్తల్లో కూడా నిజం లేదన్నారు. మార్జిన్ పెంచినప్పటికీ బాటిల్‌కి రూ.10లు పెంపుతో ప్రభుత్వానికి ఏటా రూ.100 కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. వాస్తవాలు ఇంత స్పష్టంగా తెలుస్తున్నప్పటికీ లేనిపోని వార్తలు రాయడం సరికాదన్నారు. 2019-24 మధ్య కాలంలో జేబులు నింపుకోవడం కోసం రూ.60లు ఉండే క్వార్టర్ రూ.200కి అమ్మారన్నారు. పొరుగు రాష్ట్రాలే కాదు ప్రపంచంలో ఏ మూలనా దొరకని బ్రాండ్లను ఏపీలో ప్రజల నెత్తిన రుద్దారని విమర్శించారు. కల్తీ బ్రాండ్లను సొంత వారితో అమ్మకాలు సాగించి ప్రజల ప్రాణాలు హరించారని, అలాంటి వారు నేడు విమర్శలు చేస్తుంటే ఆశ్చర్యంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కల్లుగీత కార్మికులకు 340 షాపులు కేటాయించామని, కానీ వైసీపీ నాయకులు వారికి షాపుల కేటాయింపును, కల్లుగీత కార్మికులు ఎదుగుదలను కూడా అడ్డుకోవాలని కోర్టుకు వెళ్లి భంగపడ్డారన్నారు. కోర్టుల్లో వారి కుట్రలు పారకపోయేసరికి తప్పుడు ఆరోపణలకు దిగారన్నారు. ఎన్నికల కోడ్ ఉన్న ఆరు జిల్లాలు మినహా మిగిలిన అన్ని జిల్లాల్లోనూ షాపుల కేటాయింపు పారదర్శకంగా, ప్రశాంతంగా జరుగుతోందన్నారు. బూం బూం, బ్లాక్ బాస్టర్ లాంటి పిచ్చి మద్యం బ్రాండ్లను తెచ్చి ప్రజల ప్రాణాలు తీసిన వారు కూడా ఇప్పుడు మద్యం విధానం గురించి మాట్లాడుతుంటే హాస్యాస్పదంగా ఉందన్నారు. రూ.99లకే నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తెచ్చామని, గతంలో రెండు రకాల పరీక్షలు నిర్వహించి ప్రజల ప్రాణాలు తీశారన్నారు. కానీ నేడు 12 రకాల పరీక్షలు నిర్వహించిన తర్వాతే షాపులకు తరలిస్తున్నామని మంత్రి రవీంద్ర వివరించారు. ఎక్కడా ఎవరి ప్రమేయం లేకుండా డిపోల నుండి వచ్చే ఇండెంట్ ఆధారంగా మాత్రమే మద్యం కేటాయింపులు చేస్తున్నామని, గతంలో జగన్ రెడ్డి ముఠా చెప్పిన బ్రాండ్లు మాత్రమే షాపుల్లో అమ్మాలనే నిబంధనలు పెట్టి ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టారని ధ్వజమెత్తారు.కానీ నేడు ప్రజలు వారికి కావాల్సిన బ్రాండ్లు కొనుక్కునే స్వేచ్ఛ ఇచ్చామన్నారు. గత ఐదేళ్లు అధికారాన్ని అడ్డం పెట్టుకుని షాపుల్ని, అధికారుల్ని డిస్టిలరీలను చెప్పు చేతల్లో పెట్టుకున్నారన్నారు. మద్యం వ్యాపారం మొత్తాన్ని గుప్పిట్లో పెట్టుకుని దోచుకున్నారన్నారు. ఆ మొత్తం దోపిడీపై విచారణ జరుగుతోందని, త్వరలోనే పూర్తి నివేదికలు వస్తాయన్నారు. అక్రమాలు బయటపడతాయనే భయంతోనే ఆరోపణలు చేస్తున్నారని, బెల్టు షాపుల విషయంలో కూడా ప్రభుత్వం కఠినంగా ఉందని, ట్రాక్ అండ్ ట్రేస్ విధానంలో ప్రతి బాటిల్‌ని మానిటర్ చేస్తున్నామన్నారు. బెల్టు షాపులు నిర్వహిస్తూ పట్టుబడితే, మద్యం ఇచ్చిన షాపుకు తొలిసారి రూ.5లక్షల జరిమానా విధిస్తామని, మరోసారి పట్టుబడితే ఏకంగా లైసెన్స్ రద్దు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలోనే నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించబోతున్నట్టు మంత్రి తెలిపారు. సారా రహిత రాష్ట్రంగా ఏపీని తయారు చేయడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామన్నారు. అవసరమైన మేరకు పీడీ యాక్ట్ కేసులు కూడా నమోదు చేస్తామన్నారు. వైసీపీ నాయకులు ఎన్ని ఆరోపణలు చేసినా, ఎన్ని రకాలుగా కుట్రలు చేసినా మద్యం విషయంలో వారి దోపిడీని ప్రజలు మరిచిపోరని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.

# యువతా.. దేశ భవిష్యత్తు మీ చేతుల్లోనే..




**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 11, మేజర్ న్యూస్ :** దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తు.చ. తప్పకుండా పాటిస్తూ భద్రమైన సమాజం దిశగా ముందడుగు వేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు (జనవరి 16-ఫిబ్రవరి 15) సందర్భంగా ఇందిరాగాంధీ మునిసిపల్ మైదానం-ఈట్ స్ట్రీట్ వద్ద ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర, అధికారులు తదితరులతో కలిసి రహదారి భద్రత వాకథాన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ వాకథాన్ బెంజ్ సర్కిల్ వరకు సాగింది. కార్యక్రమంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ స్వాతంత్ర్య సాకారానికి రహదారి భద్రత కూడా అత్యంత ముఖ్యమని, యువతతో పాటు ప్రతిఒక్కరూ రహదారులను బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవాల్సిన అవసరముందన్నారు. గతేడాది ఒక్క ఎన్‌టీఆర్ జిల్లాలోనే రోడ్డు ప్రమాదాల వల్ల 400 మందికి పైగా మరణించారంటే మన రహదారుల భద్రతపై ప్రతిఒక్కరూ ఆలోచించాల్సిన అవసరముందన్నారు. కేవలం వాహనాలను నడిపే వారు మాత్రమే కాకుండా దాదాపు 50 శాతం మరణాలు పాదచారులకు సంబంధించినవేనని వివరించారు. మనం రహదారులను సురక్షితంగా ఉపయోగించుకుంటే మనల్ని చూసి మిగిలినవారూ అదే దారిలో పయనిస్తారన్నారు. లైసెన్సు లేకుండా, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం సరికాదని.. మన భద్రత కోసమే వాటిని తప్పనిసరిగా ఉపయోగించాలనే విషయాన్ని గుర్తించాలన్నారు. ఇంతగా అవగాహన కల్పిస్తున్నా బాధ్యత మరిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యకలాపాలను కూడా పకడ్బందీ అమలుచేస్తున్నామని.. రహదారి భద్రత దిశగా చేపడుతున్న కార్యక్రమాల్లో భాగమవుతున్న వివిధ శాఖల అధికారులు, ఎన్‌జీవోలు, ప్రైవేటు సంస్థలకు అభినందనలు, ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

### అంతే భద్రంగా ఇంటికెళ్లాలి: వీఎంసీ ధ్యానచంద్ర హెచ్ఎం

ఇంటి నుంచి ఎంత భద్రంగా బయటికి వచ్చామో అంతే భద్రంగా ఇంటికి వెళ్లి, కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలంటే ప్రతిఒక్కరూ రహదారి భద్రతా నియమాలను పాటించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర అన్నారు. రహదారి భద్రతకు ఇంజనీరింగ్ పరంగా వివిధ చర్యలు తీసుకుంటున్నామని.. వీటికి తోడు ప్రజలు కూడా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ధ్యానచంద్ర కోరారు. డీటీసీ ఎ.మోహన్ మాట్లాడుతూ ప్రమాదం జరిగాక బాధపడేకంటే, జరక్కుండా జాగ్రత్తపడటం అత్యుత్తమమని, రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. రవాణా, రహదారులు-భవనాలు, పోలీస్, ట్రాఫిక్ తదితర విభాగాల అధికారులతో ఎప్పటికప్పుడు రహదారి భద్రతా కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాదచారులు కూడా ఎక్కడపడితే అక్కడ రోడ్డును దాటకుండా ట్రాఫిక్ సూచనలు పాటించాలని సూచించారు. ఇప్పుడు నేర్చుకున్న విషయాలను జీవితాంతం గుర్తుపెట్టుకోవాలని డీటీసీ మోహన్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎన్‌జీజీవో నేతలు కేవీ శివారెడ్డి, ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు రహదారి భద్రత నియమాలను తప్పనిసరిగా పాటిస్తూ అందరికీ ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. సరైన అవగాహన ఏర్పరచుకొని రహదారి భద్రత ప్రాధాన్యాన్ని గుర్తించి, ఆచరించాలని సూచించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో కీలక భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షులు ఎం.రాజుబాబుతో పాటు డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. కొల్లేటి రమేష్, ఆర్‌టీవోలు ఆర్.ప్రవీణ్, కె.వెంకటేశ్వరరావు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎ.ఉదయ శివప్రసాద్, వై.నాగేశ్వరరావు, కె.శివరామగౌడ్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, పీబీ సిద్ధార్థ, కేబీఎన్, శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల, ఎస్ఆర్ఆర్-సీవీఆర్ డిగ్రీ కళాశాల విద్యాసంస్థల విద్యార్థులు, రవాణా శాఖ అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# 'స్పోర్ట్స్ డేటా గేమ్‌థాన్'ను ప్రారంభించిన ఎఫ్ఐఎఫ్ఎస్

## భారతదేశ ప్రీమియర్ ఇన్‌స్టిట్యూట్‌ల కోసం ఇదోక స్పోర్ట్స్ ఏఐ ఛాలెంజ్

**విజయవాడ మేజర్ న్యూస్ :** స్పోర్ట్స్ టెక్‌లో భారతదేశాన్ని గ్లోబల్ హబ్‌గా మార్చాలనే లక్ష్యంతో ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫాంటసీ స్పోర్ట్స్ (ఎఫ్ఐఎఫ్ఎస్) ఆధ్వర్యంలో డ్రీమ్11 సమర్పనలో స్పోర్ట్స్ ఏఐ ఛాలెంజ్ 'స్పోర్ట్స్ డేటా గేమ్‌థాన్'ను ప్రారంభించింది. ఈ అధునాతన సాంకేతిక పోటీ డేటాను సమగ్రపరచడంతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్) వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను క్రీడలకు ఉపయోగించుకోవడానికి నూతన మార్గాలను అన్వేషించే దిశగా అడుగులేస్తుంది. ఈ గేమ్‌థాన్‌లో ప్రీమియర్ ఇన్‌స్టిట్యూట్‌ల నుండి విద్యార్థి జట్లు పాల్గొంటాయి. ఇందులో పాల్గొనే వారు ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ 2025 సందర్భంగా రోజు వారీ ఫాంటసీ స్పోర్ట్స్ ఫార్మాట్‌లో పోటీపడతారు. ముఖ్యంగా డేటా అనలిటిక్స్ నైపుణ్యాలను ఉపయోగించుకుంటూ, గేమ్‌థాన్ యొక్క బదిలీ పరిమితులు ఇతర నియమాలకు కట్టుబడి విజేతగా నిలవడానికి వ్యూహాన్ని రూపొందించడంలో ఏఐ, ఎంఎల్ నమూనాలను నిర్మించాలి. ఈ ప్రతిష్టాత్మక పోటీకి 30 కి పైగా ప్రముఖ సంస్థలు ఆసక్తి చూపాయి. వారి వ్యూహాత్మక ప్రణాళికలను సమీక్షించిన తర్వాత., ఐఐటి బాంబే, ఐఐటి ఢిల్లీ, ఐఐటి ఖరగ్‌పూర్, ఐఐటి కాన్పూర్, ఐఐఐటి ధార్వాడ్ వంటి సంస్థల నుండి 52 జట్లు షార్ట్‌లిస్ట్ చేయబడ్డాయి. మొదటి మూడు జట్లు వరుసగా రూ.12.5 లక్షలు, 7.5 లక్షలు, 5 లక్షలు అందుకుంటూ మొత్తంగా 25 లక్షల బహుమతిని గెలుచుకుంటారు. గేమ్‌థాన్ అంతటా విద్యార్థులకు మద్దతుగా, ఎఫ్ఐఎఫ్ఎస్ ఇద్దరు నిపుణులను ఆన్-బోర్డ్ చేసింది - ప్రఖ్యాత క్రికెట్ విశ్లేషకుడు జాయ్ భట్టాచార్య, యుఎస్ లోని కొలంబియా విశ్వవిద్యాలయంలో ఏఐ వైస్ డీన్ ప్రొఫెసర్ విశాల్ మిశ్రా, విద్యార్థి బృందాలకు వారి నిపుణుల మార్గదర్శకత్వాన్ని అందిస్తారు.

ఈ సందర్భంగా ఎఫ్ఐఎఫ్ఎస్ డైరెక్టర్ జనరల్ జాయ్ భట్టాచార్య మాట్లాడుతూ.., "స్పోర్ట్స్ డేటా గేమ్‌థాన్ యొక్క మొదటి ఎడిషన్‌ను ప్రారంభించడానికి మేము సంతోషిస్తున్నాము. మా ప్రయత్నానికి విశేష స్పందన లభిస్తుంది. ఈ గేమ్‌థాన్‌లో ప్రధానం?గా యువతరం పోటీ పడటం పట్ల మేము సంతోషిస్తున్నామ"ని అన్నారు. 'స్పోర్ట్స్ డేటా గేమ్‌థాన్' అనేది ఆవిష్కరణకు ప్రోత్సాహక వేదికగా మారడంతో పాటు భారతదేశాన్ని స్పోర్ట్స్ టెక్నాలజీలో ప్రపంచ నేతగా ఎదగడమే లక్ష్యంగా ముందుకు తీసుకెళ్లనుంది. ఈ తరంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న స్పోర్ట్స్ అనలిటిక్స్ రంగంలో యువ ప్రతిభను పెంపొందించడంతో గేమ్‌థాన్ అభిమానుల భాగస్వామ్యాన్ని పునర్నిర్వచించడానికి.. అత్యాధునిక సాంకేతికత, డిజిటల్ కంటెంట్ అనుసంధానం చేసే విశిష్టమైన వ్యవస్థను పెంపొందిస్తుంది. దీని గురించి మరింత తెలుసుకోవడానికి, https://fifsgameathon.in సందర్శించండి.

# శక్తి సామర్థ్య కార్యక్రమాల బలోపేతానికి ఈఈఎస్ఎల్ అంతర్జాతీయ భాగస్వామ్యం




**విజయవాడ మేజర్ న్యూస్ :** అధికార మంత్రిత్వ శాఖ కింద ప్రభుత్వ రంగ సంస్థల జాయింట్ వెంచర్ అయిన ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఇఇఎస్ఎల్), దాని 15 వ ఫౌండేషన్ రోజును గుర్తించడానికి వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని చేయడం ద్వారా స్థిరమైన ఇంధన పరివర్తనపై తన నిబద్ధతను బలోపేతం చేసింది. సంస్థ మెమోరాండం ఆఫ్ అండర్స్టాండింగ్ (ఎం ఓ యు), ప్రముఖ అంతర్జాతీయ, భారతీయ సంస్థలతో రూ.500 కోట్ల విలువైన ఒప్పందాలపై సంతకం చేసింది. వినూత్న ఇంధన సామర్థ్య పరిష్కారాలు, సహకార వృద్ధికి మార్గం సుగమం చేసింది. ఇండోనేషియా-మలేషియా-థాయిలాండ్ గ్రోత్ ట్రయాంగిల్, జాయింట్ బిజినెస్ కౌన్సిల్ (ఐఎంటి జెటీ జెబీసీ), గ్రీన్ గ్రోత్ ఆసియా ఫౌండేషన్ (జి జి ఏ ఎఫ్),, ఐఐటి హైదరాబాద్లతో ఈ ఈ ఎస్ ఎల్ అధికారిక భాగస్వామ్యం చేసుకుంది. ఆవిష్కరణ, సరిహద్దు సహకారానికి దాని నిబద్ధతను బలోపేతం చేసింది. మౌస్, సమిష్టిగా రూ.500 కోట్ల విలువ, శక్తి-సమర్ధవంతమైన లైటింగ్, క్లీన్ వంట పరిష్కారాలు, అంతరిక్ష తాపన, పునరుత్పాదక శక్తి, ఎలక్ట్రిక్ మొబిలిటీ, శీతలీకరణ సాంకేతికతలు, కన్సల్టెన్సీ సేవలు వంటి క్లిష్టమైన ప్రాంతాలను అభివృద్ధి చేయడంపై దృష్టి పెడుతుంది. అదనంగా, హిమాచల్ ప్రదేశ్, హార్టికల్చర్ విభాగం క్రింద హెచ్ పీ నర్సరీ మేనేజ్‌మెంట్ సొసైటీతో సౌర విద్యుత్ మైక్రో కోల్డ్ స్టోరేజ్ సొల్యూషన్ ను అమలు చేయడానికి ఈ ఈ ఎస్ ఎల్ ఒప్పందాలు కుదుర్చుకుంది.



## 16న గుడ్లవల్లేరుకు మాలలంతా తరలిరండి

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలంలోని కూరాడ, విన్నకోట, చంద్రాల గ్రామాల యువతతో సోమవారం రాత్రి ఎస్సీ వర్గీకరణపై మాలలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల స్థాయిలో ఈ నెల 16 వ తేదీ గుడ్లవల్లేరు నెహ్రూ నగర్ లో ఏర్పాటు చేసేటువంటి మాల సభకు అన్ని గ్రామాల నుంచి మాలలు తరలి రావాలని కోరుతూ యువతను చైతన్య పరిచారు. ఈ సందర్భంగా మాల సమైక్య నాయకులు కోటే రామ్ నాథ్ మాట్లాడుతూ ఇప్పటికే మండలంలో చాలా గ్రామాల్లో ఎస్సీ వర్గీకరణపై మాలల చైతన్య కార్యక్రమాలు నిర్వహించామని, ఎల్లుండి లోపు మిగతా గ్రామాల్లో సభలు నిర్వహించి మాలలను చైతన్యపరచనున్నామని, వేలాదిగా 16న గుడ్లవల్లేరుకు మాలలంతా సంఘటితంగా తరలివస్తారని తెలిపారు. యువకులు జై మాల జై భీమ్ అంటూ నినదించారు. ఈ కార్యక్రమంలో మాల సమైక్య నాయకులు కోటే రామ్ నాథ్, కామ్రేడ్ జక్కుల నెలబాలుడు, గోత్రు నాగబాబు, యువకులు, పెద్దలు పాల్గొన్నారు.

# అవనిగడ్డలో సీఎన్జీ సౌకర్యం కల్పించాలి: రాయపూడి



**అవనిగడ్డ,మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లాలోని అవనిగడ్డ నియోజకవర్గానికి సిఎన్జి గ్యాస్ సౌకర్యం కల్పించాలని ఉమ్మడి కృష్ణాజిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు కోరారు.మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో నియోజకవర్గం పేరు గొప్ప ఊరు దిబ్బ అనే విధంగా ఉందని నియోజకవర్గంలో నాగాయలంక మండలం వక్కపట్ల వారి పాలెం,భావదేవరపల్లి మధ్యన ఓఎన్జిసి వారి ప్లాంటు నెలకొల్పి,గ్యాస్, పెట్రోలియం ఉత్పత్తులు మన నియోజకవర్గ నుండి తరలిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. ప్రస్తుతం అవనిగడ్డ నియోజకవర్గం లో సిఎన్జి గ్యాస్ తో నడిచే వాహనాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. గతంలో ఓఎన్జిసి ప్లాంట్ వద్ద వాహనాలకు సిఎన్జి సౌకర్యం కల్పించారు.కొన్ని రోజుల తర్వాత అక్కడ నిలిపివేసి అవనిగడ్డ ఈస్ట్ కోస్ట్ దగ్గరలో ఉన్న పెట్రోల్ బంకులో సిఎన్జి ప్లాంట్ నెలకొల్పి కొంతకాలం వాహనాలకి ఇబ్బంది లేకుండా సిఎన్జి అందించారు. ప్రస్తుతం కారణం తెలియదు గానీ అక్కడ ఉన్న పెట్రోల్ బంక్ లో సిఎన్జి ప్లాంట్‌ను తీసివేయడంతో 6 మండలాల లోని వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలామంది అవనిగడ్డలో సిఎన్జి గ్యాస్ దొరుకుతుందని నిరుపేద కుటుంబాల వారు ఆటోలు కూడా కొనుక్కుని జీవనం సాగిస్తున్నారు. ఒక్కసారిగా సిఎన్జి ప్లాంట్ తీసేయడం వల్ల సుమారు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న మచిలీపట్నం గాని,80 కిలోమీటర్ల దూరంలో ఉన్న విజయవాడ గాని వెళ్లి సిఎన్జి వాహనదారులు తమ వాహనాలకి గ్యాస్ పెట్టించుకునే పరిస్థితి ఏర్పడింది. మన నియోజకవర్గంలో ఓఎన్జిసి వారు మన ఖనిజ సంపద ద్వారా కోట్లు గడిస్తూ బయట ప్రాంతాలకు సిఎన్జిని తరలిస్తూ, అవినిగడ్డ నియోజకవర్గానికి మొండి చేయి చూపించటం చాలా బాధాకరం అన్నారు. ఓఎన్జీసీ ప్లాంట్ వారు అవనిగడ్డ నియోజకవర్గంలో యువతకి ప్రాధాన్యత ఇవ్వవలసిన పరిస్థితుల్లో అలాంటి సౌకర్యం కూడా కల్పించకుండా, కొన్ని గ్రామాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేయవలసిన పరిస్థితి వారి మీద ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించడం చాలా బాధాకరం. ఇప్పటికైనా ఓఎన్జిసి అధికారులు స్పందించి వాహనదారుల యొక్క ఇబ్బందులను గమనించి ఓఎన్జిసి ప్లాంట్ వద్ద ఒక సిఎన్జి ప్లాంట్‌ను నెలకొల్పి వాహనదారుల ఇబ్బందులను తొలగించాలని కోరారు. అదేవిధంగా ఓ ఎన్ జి సి ప్లాంట్ దగ్గర అవకాశం లేకపోతే ఓఎన్జిసి ప్లాంట్ వారు అవనిగడ్డ పట్టణంలో ఒక సీఎన్జీ ప్లాంట్‌ను నెలకొల్పి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూడవలసిందిగా జనసేన పార్టీ తరపున రాయపూడి డిమాండ్ చేశారు.

## బ్లాక్ మార్కెట్‌ను నిర్మూలనకు పీఎంఐ పిలుపు

**విజయవాడ మేజర్ న్యూస్ :** అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా, ఫిలిప్ మోరిస్ ఇంటర్నేషనల్ కంపెనీ (పీఎంఐ) ఇండియా అనుబంధ సంస్థ, ఐపిఎం (ఐపీఎం) ఇండియా, భారతదేశ ఆర్థిక ప్రయోజనాలు, జాతీయ భద్రత, ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు కీలకమైన బ్లాక్ మార్కెట్ పొగాకు వాణిజ్యాన్ని నిర్మూలించేందుకు వివిధ రంగాలకు చెందిన, అంతర్జాతీయ సహకారానికి పిలుపునిచ్చింది. ఫిక్కీ కాస్కేడ్ నివేదిక ప్రకారం, అక్రమ వ్యాపారం ఒక ప్రపంచ సంక్షోభం. ఇది ప్రపంచ స్థూల జాతీయోత్పత్తిలో 3 శాతం కన్నా ఎక్కువకు సమానమైన ఏడాదికి 2 ట్రిలి యన్ డాలర్ల అంచనా వేయబడిన షాడో ఆర్థిక వ్యవస్థను పెంచుతుంది. అక్రమ వ్యాపారం చట్టబద్ధమైన వ్యాపారాలను బలహీనపరుస్తుంది. ప్రభు త్వాలకు రావలసిన కీలకమైన ఆదాయానికి గండి కొడుతుంది. నేర సంస్థల కు నిధులు సమకూరుస్తూ, వినియోగదారులకు నియంత్రణ లేని ఉత్పత్తు లకు అందేలా చేస్తుంది. అక్రమ పొగాకు వ్యాపారం తీవ్రమైన ముప్పు. ఇది ఆర్థిక వృద్ధిని, అభివృద్ధిని అణచివేస్తుంది. నకిలీల నుంచి వినియోగదారు లను రక్షించడం, ఉత్పత్తుల అక్రమ రవాణాను, నకిలీని నిరోధించడం చాలా ముఖ్యం. అక్రమ పొగాకు వాణిజ్యానికి వ్యతిరేకంగా పోరాటంలో పీఎంఐ ముందంజలో ఉందని, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాల్సిన తక్షణ అవసరం ఎంతైనా ఉందని ఐపిఎం ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ నవనీల్ కర్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## సుబ్రహ్మణ్యం పార్థివ దేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే



**పామర్రు ఫిబ్రవరి 11 మేజర్ న్యూస్:** పామర్రు టౌన్ బాపూజీపేటలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తాడిశెట్టి సుబ్రహ్మణ్యం పార్థివదేహానికి స్థానిక శాసనసభ్యుడు వర్ల కుమార్ రాజా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి అండగా నిలబడతామని హామీ ఇచ్చారు. అనంతరం జరిగిన అంతిమయాత్రలో జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి తాడిశెట్టి నరేష్ తో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకరణ డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ చేయుటకు కేంద్ర ప్రభుత్వం రైతులకు 12 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య యు ఐ డిఫార్మర్ రిజిస్ట్రీ రైతులకు అందుబాటులోకి తీసుకువస్తుంది.కావున మచిలీపట్నం మండలంలోని సొంత భూమి కలిగిన రైతులు ఆధార్ కార్డు పట్టాదారు పాస్ బుక్ / 1బి ఆధార్ కార్డు లింక్ చేయబడ్డ మొబైల్ నెంబర్ తీసుకొని మీ గ్రామ రైతు సేవ కేంద్రంలో ఈ ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ద్వారా వచ్చే పథకాలు పీఎం కిసాన్,అన్నదాత సుఖీభవ, రాయితీలు, పంటల బీమా, పంట ఋణాలు వివిధ పథకాలు సేవలు పొందుటకు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని తెలియచేయుచున్నము. కావున ప్రతి సొంత భూమి కలిగిన రైతు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరిగా మీ గ్రామ పరిధిలోని రైతు సేవ కేంద్రం లో నమోదు చేయించుకోవాలని బందరు మండల, వ్యవసాయశాఖ అధికారి డి హరిక తెలిపారు.

## రైతు విశిష్ట సంఖ్య నమోదు (ఫార్మర్ రిజిస్ట్రీ) కార్యక్రమం



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకరణ (డిజిటలైజేషన్) (డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ - డిఏఎం) చేయుటకు కేంద్ర ప్రభుత్వం రైతులకు 11 అంకెల 'ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య (యుఐడి) ఫార్మర్ రిజిస్ట్రీ" ఆధార్ కార్డు తరహాలో రైతులకు అందించనుందని గుడ్లవల్లేరు మండల వ్యవసాయాధికారి ఎల్.సునిల్ మంగళవారం జరిగిన సమావేశంలో తెలిపారు. కావున ప్రతి స్వంత భూమి కలిగిన రైతులు " ఆధార్ కార్డు, పొలం పాస్ బుక్ లేదా 1బి ఆధార్ కి లింక్ అయిన ఫోను" తీసుకుని మీ గ్రామ రైతు సేవ కేంద్రంలో ఈ ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే పథకాలు (పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ), రాయితీలు, పంటల భీమా, కనీస మద్దతు ధర, పంటల ఋణాలు వివిధ పథకాలు సేవలుపొందుటకు ఫార్మర్ రిజిస్ట్రీతప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దర్ లోకరాజు మాట్లాడుతూ ప్రతి స్వంత భూమి కలిగిన రైతు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌కి విశిష్ట సేవా పురస్కారం




**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ మదర్ తెరిసా విశిష్ట సేవా పురస్కారానికి ఎంపికైనట్లు ఎంపిక కమిటీ చైర్మన్ ఆకుమళ్ళ నాని మంగళవారం ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. మదర్ తెరిసా జాతీయ విశిష్ట సేవా పుస్కారానికి అవనిగడ్డ మండల పరిధిలోని పులిగడ్డ గ్రామ సర్పంచ్ ఇటీవల కృష్ణా నదికి వచ్చిన వరదల్లో గ్రామస్తులకు అండగా ఉంటూ కరకట్ట పరిరక్షణకు సర్పంచ్ విజయ్ కుమార్ చర్యలు చేపట్టి గ్రామస్తులను కాపాడారన్నారు. కరోనా సమయంలో వ్యాధి బారిన పడిన వారికి బలవర్ధకమైన ఆహారాన్ని అందించడంతోపాటు వారిని వైద్య సదుపాయాలను సర్పంచ్ సమకూర్చి ప్రాణాపాయము లేకుండా కాపాడి ప్రజలకు అందించిన సేవలను గుర్తించి మదర్ తెరిసా జాతీయ విశిష్ట సేవా పురస్కారానికి విజయ్ కుమార్‌ను ఎంపిక కమిటీ ఎంపిక చేసిందని తెలిపారు. ఈనెల 26వ తేదీన హైదరాబాదులోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో విజయ్ కుమార్ అవార్డు అందుకోనున్నారు మదర్ తెరిసా విశిష్ట సేవా పురస్కారానికి సర్పంచ్ విజయకుమార్ ఎన్నిక కావడం పట్ల మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పులిగడ్డ పిచ్చే శ్వరరావు గ్రామ కార్యదర్శి అనిత ఉప సర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు తో పాటు మండలంలోని పలువురు సర్పంచులు అభినందనలు తెలిపారు.

## ప్రారంభమైన ఆదిలక్ష్మి కామేశ్వరి అమ్మవారి ఉత్సవాలు



**పామర్రు ఫిబ్రవరి 11 మేజర్ న్యూస్ :** పమిడిముక్కల మండలంలోని కూడేరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ ఆదిలక్ష్మి కామేశ్వరి అమ్మవారి ఉత్సవాలు మంగళవారం వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య, మంగళ వాయిద్యాలు నడుమ అంగరంగ వైభవంగా ప్రారంభమైనాయి. మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాలు తొలిరోజు విఘ్నేశ్వర పూజ, గోపూజ, మాతంగి పూజ అనంతరం ఐనపూరు కృష్ణా నదిలో మృత్తికా స్నానాలు చేసి అమ్మవారి మూర్తులకు పూజలు నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో అఖండ దీపారాధన, అమ్మవారి మూలవిరాట్టుకు స్నపన, 108 కలశాలతో అభిషేకం, అలంకారం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు రెండు రాష్ట్రాలలో స్థిరపడిన కావూరి వంశీయులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

## విశిష్ట సంఖ్యా నమోదు తప్పనిసరి

### ఏ.వో శివప్రసాద్



**మొవ్వ (ఫిబ్రవరి 11) మేజర్ న్యూస్:** సొంత భూమి గల రైతులు తమ గ్రామాల్లోని రైతు సేవ కేంద్రాల్లో విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి కే. శివ ప్రసాద్ రైతులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం సొంత భూమి గల రైతులకు ఆధార్ తరహా యూనిక్ ఐడి కార్డులు అందించనుందన్నారు. తద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందించే పలు రాయితీలు, ఎరువులు పై సబ్సిడీ, పంటల భీమా, పెట్టుబడి సాయం, అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్, ఈ క్రాప్ వంటి పథకాలకు విశిష్ట సంఖ్య (ఫార్మర్ రిజిస్ట్రీ) నమోదు ఎంతో దోహదపడుతుందని తెలిపారు. రైతులు ఆయా గ్రామాల్లో గల రైతు సేవ కేంద్రాల్లో భూమి పాస్ పుస్తకం జిరాక్స్ లేదా 1 బి, ఆధార్ కార్డ్, ఆధార్ నెంబర్ తో లింకు అయినా ఫోను తీసుకెళ్లి రైతు విశిష్ట సంఖ్య (ఫార్మర్ రిజిస్ట్రీ) 14 అంకెల యునిక్ ఐడి నమోదు చేసుకోవాలని ఏవో శివప్రసాద్ తెలిపారు.

## మోటుపల్లి ప్రసన్నకుమార్‌ని అభినందించిన బండి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఎస్ ఎల్ సీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మోటుపల్లి ప్రసన్నకుమార్‌ని మచిలీపట్నం జనసేన ఇంచార్జ్ బండి రామకృష్ణ, జనసేన పార్టీ యువ నాయకులు గన్నవరం ఎయిర్పోర్ట్ అథారిటీ కమిటీ బోర్డ్‌మెంబర్ బండి విజయ్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

# దివి వ్యాయామోపాధ్యాయుల కృషి అభినందనీయం

### సెంట్రల్ జోన్ బాలికల ఆటల పోటీలు ప్రారంభించిన బొబ్బా గోవర్ధన్





**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** దివిసీమలోని నిరుపేద క్రీడాకారులను ప్రోత్సహించి వారిలో నైపుణ్యాలను వెలికితీయడంలో వ్యాయామోపాధ్యాయుల కృషి అభినందనీయమని ప్రముఖ పారిశ్రామికవేత్త తెలుగుదేశం పార్టీ నాయకులు బొబ్బా గోవర్ధన్ అన్నారు. స్థానిక ప్రభుత్వ క్రీడా మైదానంలో గ్రిగ్ మెమోరియల్ సెంట్రల్ జోన్ బాలికల ఆటల పోటీలను మంగళవారం బొబ్బా గోవర్ధన్, రెడ్రొతు కృష్ణబాబుతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎంతో నైపుణ్యం ఉన్న క్రీడాకారులు ఉన్నారని వారికి కొద్దిపాటి ప్రోత్సాహాన్ని ఇస్తే వారు మరింత మెరుగుగా రాణించగలుగుతారన్నారు.. తాము కూడా అవనిగడ్డ ప్రభుత్వ క్రీడా మైదానంలో ఆటలు ఆడుకున్న వారిమేనని వ్యాయామోపాధ్యాయులతో నాటి స్మృతులు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మరో అతిథిగా పాల్గొన్న జిల్లా వ్యాయామోపాధ్యాయుల సంఘ జిల్లా అధ్యక్షులు ఏం మణి మాట్లాడుతూ, పారిశ్రామికవేత్త బొబ్బా గోవర్ధన్ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ బహుమతులు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయం అని అన్నారు.. ఆటల పోటీలలో పాల్గొనే వారికి బొబ్బా గోవర్ధన్ బహుమతులు సమకూర్చగా రెడ్రొతు కృష్ణబాబు భోజన సదుపాయం సమకూర్చారు.. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ సింహాద్రి గంగాధర్, మారుతీ, ఉదయ్, పూర్ణచంద్రరావు, సురేష్, మురళి,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా గోవర్ధన్, కృష్ణబాబులు కబడ్డీ, ఖో ఖో ఆడి క్రీడాకారులను ఉత్తేజపరిచారు.

## శ్రీ రంగనాయక స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు

### నేడు రంగనాయకుని స్వామివారి కల్యాణం





**జగ్గయ్యపేట ఫిబ్రవరి 11 మేజర్ న్యూస్ :** పట్టణంలోని చారిత్రక ప్రాశస్త్యం గల శ్రీ భూ గోదా సమేత శ్రీ రంగ నాయక స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ వంశపారం ధర్మకర్త శ్రీరాం బదరీ నారాయణ, ఆలయ కార్య నిర్వహణ అధికారి సి.జయప్రకాష్ బాబులు తెలిపారు. 11వ తేదీ మంగళవారం ఉదయంస్వామివారిని పెళ్లి కుమారుని చేయుట సాయంత్రం విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన, ధ్వజారోహణ తదితర కార్యక్రమాలు, 12వ తేదీ బుధవారంసాయంత్రం ఐదు గంటలకు దేవేరులతో స్వామివారి ఎదురుకోల ఉత్సవం, ఏడు గంటలకు శ్రీ స్వామివారి కళ్యాణ మహోత్సవం నిర్వహించబడును. 13వ తేదీగురువారం ఉదయం నిత్య హోమం బలిహరణ సాయంత్రం స్వామివారి గరుడసేవ, 14వ తేదీ శుక్రవారం రాత్రి స్వామివారి రథోత్సవం, 15వ తేదీ శనివారం ఉదయం కొట్నాలు, చక్ర తీర్థం, తిరువ జోత్సవం సాయంత్రం మహా పూర్ణాహుతి ధ్వజా అవరోహణం, 16వ తేదీ ఆదివారం సాయంత్రం ద్వాదశ ప్రదక్షిణాలు, ద్వాదశనైవేద్యాలు, 17వ తేదీ సోమవారం రాత్రికి స్వామివారి పవళింపు సేవ కార్యక్రమాలతో స్వామివారి వార్షిక కళ్యాణ మహోత్సవాలు ముగుస్తాయని తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో యావన్మంది భక్తులు పాల్గొని శ్రీ రంగనాథుని కృపకు పాత్రులు కావాలని కోరారు.

## సుపోషితపై అంగన్వాడీలకు అవగాహన



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో సుపోషిత కార్యక్రమంపై ఎంపిడిఓ టి. విజయసారధి అంగన్వాడీ కార్యకర్తలకు అవగహనా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. సుపోషిత కార్యక్రమంలో ఎంపికైన మండలంలోని అంగలూరు, శేరిదగ్గుమిల్లి, పురిటిపాడు, కౌతవరం, వడ్లమన్నాడు గ్రామపంచాయితీలలోని 27 అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తలు పాల్గొన్నారు. సమావేశంలో కార్యకర్తల నుద్దేశించి మాట్లాడుతూ ఎంపిడిఓ విజయ సారధి, ఐసిడిఎస్ సూపర్వైజర్ వాణిలు అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ గురించి, వసతుల కల్పన గురించి వివరిస్తూ కేంద్రాల సమస్యలను దశల వారీగా పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో ఏఓ ఇమ్రాన్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో కెఎస్.లక్ష్మణరావును గెలిపించండి



**జగ్గయ్యపేట ఫిబ్రవరి 11 మేజర్ న్యూస్ :** కృష్ణ, గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ, ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక, పెన్షనర్లు, నిరుద్యోగ, కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులు, వివిధ ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కె ఎస్ లక్ష్మణరావు గెలిపించాలని కోరుతూ మండలంలోని మల్కాపురం, గండ్రాయి, గౌరవరం, రామచంద్రునిపేట గ్రామాలలో మంగళవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కోటా కృష్ణ మాట్లాడుతూ నిరంతరం కార్మికులకు, ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు అందుబాటులో ఉండే వ్యక్తి ప్రజల కోసం పోరాటం చేసే వ్యక్తి అధికారం ఉన్న లేకపోయినా కార్మికుల కోసం ఉద్యోగుల కాంట్రాక్ట్ ఉద్యోగుల కోసం నిత్యం పోరాడే ఎమ్మెల్సీ అభ్యర్థి కే ఎస్ లక్ష్మణరావు కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు షేక్ గౌస్ మియా, కోటా రవికుమార్, జె వెంకట రావు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం



**బంటుమిల్లి మేజర్ న్యూస్:** బం టుమిల్లి మండలం అర్తమూరు గ్రా మంలో మంగళ వారం పెడనని యోజకవర్గం శాస నసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ ఆదేశాల అనుసారం ఉమ్మడి కృష్ణా గుం టూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో పెడన నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు గొట్టుము క్కల రఘురామరాజు, డీసీ చైర్మన్ బొర్రా కాశీ విశ్వేశ్వరరావు, మండల కూటమి నాయకులు క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జిలు గ్రామస్తులు తదితరు లు పాల్గొన్నారు. ఉమ్మడి కృష్ణ–గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ ను ఓటు కలిగిన గ్రాడ్యుయేట్స్ అందరుతమ ప్రథమ ప్రాధాన్యత ఓటు 1 అంకె వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పెడన నియోజవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు గొట్టుముక్కల రఘురామరాజు కోరారు.

## 13న గుడ్లవల్లేరులో మహిళల మెగా వైద్య శిబిరం

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఆధ్వర్యంలో భారత దేశంలో ప్రఖ్యాతిగాంచిన మణిపాల్ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ వైద్యబృందంచే మహిళలకు ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షురాలు నిమ్మగడ్డ శశికళ తెలిపారు. ఈ శిబిరం ఫిబ్రవరి 13 గురువారం ఉదయం 9 గంట నుండి 2 గంటల వరకు గుడ్లవల్లేరు లయన్స్ సేవా భవనంలో జరుగుతుందన్నారు. పోలవరపు జగదీశ్వరరావు (అమెరికా) సౌజన్యంతో జరిగే మహిళల మెగా శిబిరంలో రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారని, ఉచితంగా బి.పి. ఆర్.బి.ఎస్.(షుగర్ టెస్ట్), మెమోగ్రఫీ (45 ఏళ్లు పైబడిన వారికి), ఈసీజి,ఎకో, పాప్ స్మెయర్, కార్డియాలజీ కన్సల్టేషన్ చేస్తారని, గుడ్లవల్లేరు పరిసర ప్రాంత మహిళలు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు శశికళ కోరారు.

# అంగరంగ వైభవంగా స్వామి కళ్యాణం

## కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య





**నందిగామ, ఫిబ్రవరి 11, మేజర్ న్యూస్:** పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ శుక శ్యామలాంబ సమేత రామలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి మాఘశుద్ధ పౌర్ణమి పర్వదినాన స్వామి వారి ఉత్సవ మూర్తులను పూలు విద్యుత్ దీపాలతో అలంకరించిన పెద్ద రథంపై ఏర్పాటు చేసి మేనతాళాలు మంగళ వాయిద్యాలు నడుమ రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి కళ్యాణ మహోత్సవంలో నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మున్సిపల్ చైర్పర్సన్ మండవ కృష్ణకుమారి తోపాటు కూటమి శ్రేణులు పలు శాఖల అధికారులు హాజరయ్యారు. తంగిరాల సౌమ్య ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ ఈఓ గంగాధర్ ఆలయ అనువంశిక ధర్మకర్త వాసిరెడ్డి మురళి రాఘవ కుమార్ పర్యవేక్షణలో ఆలయ స్థానాచార్యులు ముదిగొండ శశాంక మౌళి ఆరాధ్య ఆలయ పురోహితులు సన్నిధానం కిషోర్ శర్మ ఆలయ ఉప ప్రధాన అర్చకులు దండి పట్ల బాలకృష్ణ శాస్త్రి, ముఖ్య అర్చకులు యడవల్లి సీతారామ ప్రసాద్ పవన్ కుమార్ ఆధ్వర్యంలో రథోత్సవానికి ముందు గా అన్న కుంభాభిషేకం విశేష అర్చనది పూజలు నిర్వహించారు, ఎస్ హెచ్ ఓ వైవి లచ్చునాయుడు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రథోత్సవంలో పోలీస్ సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు పర్యవేక్షణ చేశారు. రథోత్సవం సందర్భంగా పలు సేవా సంస్థలు పారేపల్లి సాయి అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో పులిహార మంచినీరు ప్యాకెట్లు, వాసవి క్లబ్ సభ్యులు జిలేబి, రోప్ స్టార్ సభ్యులు దద్దోజనం, ఫ్రెండ్స్ సర్కిల్ కట్టె పొంగలి స్వామివారి రథోత్సవంలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

# కన్నుల పండుగగా స్వామి వారి కళ్యాణ మహోత్సవం







**నందిగామ, మేజర్ న్యూస్:** పట్టణంలో 400 సం.ల నాటి చరిత్ర కలిగిన పంచలింగ క్షేత్రంగా పిలవబడే స్వయంభు దేవాలయం శ్రీ శుఖ శ్యామలాంబ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మాఘశుద్ధ చతుర్దశి సందర్భంగా స్వామివారికి కళ్యాణ మహోత్సవం అత్యంత శోభా యమానంగా కన్నుల పండుగగా నిర్వహించారు.మొదటగా ఆలయం అంతా విద్యుత్ దీపాలతో అలంకరించారు ఉత్సవ విగ్రహాలను నంది వాహనంపై ఊరేగుతూ ఎదురుకోలోత్స నిర్వహించారు. సర్వాంగ సుందరంగా వివిధ పూలతో అలంకరించిన కళ్యాణ మండపంలో పట్టు వస్త్రాలతో నుదుటిన బాసికతో బుగ్గన చుక్కతో స్వామి అమ్మవార్లను పెళ్లి పీటలు ఎక్కారు సాక్షాత్తు శ్రీశైలం దేవస్థానంలో ఏ విధంగా స్వామి కళ్యాణం నిర్వహిస్తారో, అలాగనే నందిగామ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో కళ్యాణం నిర్వహించడం చా లా విశేషం అన్నారు.ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వా మివారిని కళ్యాణాన్ని తిలకించారు వేదమంత్రోచ్చారణ నడుమ మేళతాలలతో మంగళ వాయిద్యాలతో శాస్రోక్తంగా స్థానాచార్యులు ముదిగొండ శశాంక్ మౌలి శర్మ కళ్యాణాన్ని జరిపించారు అయ్యప్ప సేవా సంఘం వారు స్వామివారికి పలు రకాల పూజా ద్రవ్యాలను సమర్పించారు భక్తులకి ప్రసాదాలను అందించారు.

# గుడ్లవల్లేరు సమగ్రాభివృద్ధి కృషీవలుడు అడుసుమిల్లి



**ఘనంగా అడుసుమిల్లి అశ్వర్థ నారాయణ మూర్తి 38వ వర్ధంతి కార్యక్రమం**

**20 మందికి రూ.300 ల నెలసరి భృతి, 6 గురు రోగులకు రూ.15,000 ల చొప్పున ఆర్థిక సాయం**

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు గ్రామ సమగ్రాభివృద్ధి లో కీలక పాత్ర వహించి, జాతీయ స్థాయిలో గుడ్లవల్లేరు గ్రామ ఖ్యాతిని విస్తరింప చేసిన మహనీయులు ఎ.ఎ.ఎన్.ఎమ్, వి.వి.ఆర్.ఎస్.ఆర్.పాలిటెక్నిక్, ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు అడుసుమిల్లి అశ్వర్థనారాయణమూర్తి 38వ వర్ధంతి పాలిటెక్నిక్ ఆవరణలో మేనేజింగ్ ట్రస్టీ వల్లూరుపల్లి రామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు వల్లభనేని సుబ్బారావు ఘనంగానిర్వహించారు. సంస్మరణ సభా కార్యక్రమంలో భాగంగా తొలుత ట్రస్ట్ సభ్యులు జ్యోతి ప్రజ్వలన గావించి అడుసుమిల్లి అశ్వర్థనారాయణమూర్తి చిత్రపటానికి పుష్పాంజలిని ఘటిం చారు. అనంతరం మేనేజింగ్ ట్రస్టీ వి.రామకృష్ణ మాట్లాడుతూ అడుసుమిల్లి అశ్వర్థ నారాయణ మూర్తి ధన్య జీవి అని, గుడ్లవల్లేరు గ్రామ సమగ్ర అభి వృద్ధిలో అనేక విప్లవాత్మక మార్పులు ద్వారా గ్రామ సర్వతో ముఖాభివృద్ధికి తోడ్పడ్డారని దానిలో భాగంగా భూమి తనఖా బ్యాంకు, పశువుల సంత, ఎస్.ఈ.ఆర్.ఎమ్ ఎడ్యుకేషనల్ సొసైటీ, సాంకేతిక విద్య కోసం ఎ.ఎ.ఎన్. ఎమ్ అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఇలా ఆయన చివరి దశలో గ్రామ జనజీవన చైతన్యం కోసం ఏర్పాటు చేసిన ప్రైవేట్ ట్రస్ట్ ఇవన్నీ ఆయన్ని గొప్ప వ్యక్తిగా, అందరికి ఆదర్శ ప్రాయుడిగా నిలిపాయని చెప్పారు. ట్రస్ట్ సేవ కార్యక్రమంలో భాగంగా 2025–26 సంవత్స రం పేదలకు, అనాధలు అయినా 20 మంది వృద్దుల కు నెలసరి జీవన భృతిగా రూ.300/– చొప్పున, అలాగే దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న ఆరుగురు పేదరోగుల ఉపశమనంగా ఒక్కక్కరికి ఏకమొత్తం గా రూ.15,000ల ఆర్థిక సహాయం అందించడం జరిగిందని ఎ.ఎ.ఎన్. ఎ మ్ & వి.వి.ఆర్.ఎస్.ఆర్ గుడ్లవల్లేరు ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాస మూర్తి వివరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కొడాలి వెంకట కృష్ణారావు, వల్లభనేని సుబ్బారావు, అడ్సుమిల్లి సుబ్రహ్మణ్యేశ్వ రరావు, ఉప్పలపాటి సత్యనారాయణ, పొట్లూరి రవికుమార్, గ్రామ పెద్దలు జంగం మోహనరావు, డి.సురేంద్ర బాబు, పూర్వ లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వై.పి.సి ప్రసాద్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్, సెక్రటరీ నిమ్మగడ్డ శశికళ, మేరు గు పెరుమాళ్ళులు, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎన్. రాజశేఖర్, గుడ్లవల్లేరు ఇంజ నీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ బి.కరుణకుమార్, సంస్థల యాజమాన్య సభ్యుల సలహాదారు డా.పొట్లూరి రవీంద్రబాబు, ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ ఎ.లక్ష్మణ రావు, హైస్కూల్ ప్రిన్సిపాల్ సాతులూరి లీనా, వివిధ శాఖాధిపతులు పాల్గొ న్నారు. సభా కార్యక్రమాన్ని కొడాలి శరత్ బాబు, శివ ప్రసాద్ నిర్వహించారు.

## గుడ్లవల్లేరులో విద్యుత్ శాఖ విజిలెన్స్ దాడులు

### సుమారు 12,41,000.00 రూపాయలు జరిమానా



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు మండలం, కౌతవరం సెక్షన్‌లో విద్యుత్ వినియోగదారులు గృహాలు, వాణిజ్య సముదాయాలపై విద్యుత్ శాఖ విజిలెన్సు అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విజిలెన్స్ ఈఈ సిహెచ్ వాసు, గుడివాడ ఆపరేషన్ ఈ ఈ జిబి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అధికారులు 40 బృందాలుగా ఏర్పడి 2877 గృహ సర్వీసులు, 166 వాణిజ్య సముదాయాలు, 9 మిగిలిన సర్వీసులను తనిఖీ చేసినారు. వాటిలో 1 సర్వీస్‌నకు విద్యుత్ చౌర్యం క్రింద రు.20 వేలు, బ్యాక్ బిల్లింగ్ క్రింద 4 సర్వీసులకు రు.35 వేలు, 364 సర్వీసు లకు అదనపులోడు 593కిలోవాట్ మొత్తానికి రు.11లక్షల86వేలు విధించడం జరిగింది. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, విద్యుత్ చౌర్యం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరిగినట్లయితే ఈ క్రింది 9440812091, 9440812086 సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు. ఈ విద్యుత్ విజిలెన్స్ తనిఖీలలో గుడివాడ ఈఈ జిబి శ్రీనివాసరావు, గుడివాడ రూరల్ డిఈఈ పి. కిరణ్ బాబు, కౌతవరం ఏఈ ఎస్‌ఏఎస్ వరకుమార్, గుడివాడ డివిజన్ పరిధిలోని ఏఈలు, జేఈలు, లైన్ ఇన్స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుడివాడ ఈ ఈ జిబి శ్రీనివాసరావు మాట్లాడుతూ పీఎం సూర్య ఘర్ స్కీం క్రింద సౌరపలకలు ఏర్పాటు చేసుకొని విద్యుత్ బిల్లులు తగ్గించుకొనవలసినదిగా వినియోగదారులను కోరారు.

## పాలిటెక్నిక్ కళాశాలలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

**గన్నవరం, ఫిబ్రవరి 11, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్ ద్వారా గన్నవరం లోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ ఎ పద్మావతి తెలిపారు. గన్నవరం పాలిటెక్నిక్ కళాశాల లోని స్కిల్ హబ్ లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు పై ఉచిత శిక్షణ ఇస్తామని, మార్చి 15 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయి అని, నూతన సాంకేతికతను ఉపయోగించి, నిపుణుల ద్వారా శిక్షణ ఇచ్చి స్థానికంగా ఉన్న పరిశ్రమలలో ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు. కావున జిల్లాలోని ఆసక్తి ఉన్నటువంటి యువతీయువకులు ఈ కోర్సును సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. ఈ కోర్సుకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతి యువకులు అర్హులనీ, ఆసక్తి గల అభ్యర్థులు, పూర్తి వివరాలకు 9494005725 నెంబర్ను సంప్రదించి తమ వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## సత్వరమే లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించండి

### బందరు ఉప ఖజానా అధికారి వి. రమేష్ కుమార్



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఈనెల 28వ తేదీలోపు పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు, తమ లైఫ్ సర్టిఫికెట్లను బందరు ఉపఖజానా అధికారి కార్యాలయంలో కానీ, సంబంధిత పోస్ట్ ఆఫీస్ లో, నెట్ సెంటర్ లో గానీ, సమర్పించి సకాలంలో పెన్షన్లు పొందాలని ఎస్ టి ఓ వి రమేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు.ప్రభుత్వం వారు ఏర్పాటు చేసిన సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## పుణెలో జరిగిన లీడర్ షిప్ కాంక్లేవ్‌లో పాల్గొన్న పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా





**పామర్రు ఫిబ్రవరి 11 మేజర్ న్యూస్ :** పుణెలో ఈ నెల 8, 9వ తేదీల్లో జరిగిన లీడర్ షిప్ కాంక్లేవ్‌లో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ కాంక్లేవ్‌కు దేశం మొత్తం మీద 300 మంది ఎమ్మెల్యేలు హాజరుకాగా ఏపీ నుంచి కుమార్ రాజా హాజరయ్యారు. సుపరిపాలన, పబ్లిక్ పాలసీల రూపకల్పనపై ఆలోచనలు, ఉత్తమ అభ్యాసాలపై చర్చించేందుకు కాంక్లేవ్ నిర్వహించారు. ఈ కాంక్లేవ్‌లో స్వర్ణాంధ్ర విజన్, పేదరిక నిర్మూలనకు రూపొందించిన పీ4 విధానాలపై ఎమ్మెల్యే ప్రస్తావించారు. ఈ మేరకు కాంక్లేవ్ వివరాలను ఎమ్మెల్యే కుమార్ రాజా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఎమ్మెల్యే కుమార్ రాజాను అభినందించారు.



## సైబర్ మోసాలపై యువత అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** సైబర్ మోసాల పై యువత అవగాహనతో పాటు అప్రమత్తత అవసరమని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు.ప్రపంచ సురక్షితమైన ఇంటర్నెట్ దినోత్సవం సందర్భంగా మంగళవారం కలెక్టరేట్ చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సైబర్ మోసాలపై ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి నెల రెండవ మంగళవారం ప్రపంచ వ్యాప్తంగా సురక్షితమైన ఇంటర్నెట్ దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందని అన్నారు. ముఖ్యంగా డిజిటల్ అరెస్ట్, కేవైసి, ఓ.టి.పి, నెట్ బ్యాంకింగ్ ఫ్రాడ్, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్ స్కామ్, లాటరి స్కామ్స్, క్రెడిట్, డెబిట్ స్కామ్స్, ఫిషింగ్, ఫేక్ యాప్స్, లోన్ స్కామ్స్, వర్క్ ఫ్రం హోం స్కామ్స్, జాబ్ స్కామ్స్, యు.పి.ఐ. స్కామ్స్, లోన్ స్కామ్ వంటి వాటికి సంబంధించి ఎక్కువ సైబర్ మోసాలు జరుగుతుంటాయని తెలిపారు. సైబర్ మోసాలకు సంబంధించి ఇంటర్నెట్ భద్రతా సూచనలను ప్రతీ ఒక్కరూ పాటించాలని అన్నారు. సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగించేలా అవగాహన పోస్టర్లను కలెక్టర్ విడుదల చేశారు.ఈ సమావేశంలో డిఆర్ఓ కె. చంద్రశేఖరరావు, ఎన్ఐసి ఏడిఐఓ సెల్వినా, సైబర్ క్రైమ్ సిఐ వెంకటేష్,కలెక్టరేట్ ఏవో, సెక్షన్ సూపరిండెంట్లు,సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ రామలింగేశ్వర స్వామి రథం తిరునాళ్ల



**నందిగామ, ఫిబ్రవరి 11, మేజర్ న్యూస్:** పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ శుక శ్యామలాంబ సమేత రామలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి మాఘశుద్ధ పౌర్ణమి పర్వదినాన స్వామి వారి ఉత్సవ మూర్తులను పూలు విద్యుత్ దీపాలతో అలంకరించిన పెద్ద రథంపై ఏర్పాటు చేసి మేనతాళాలు మంగళ వాయిద్యాలు నడుమ రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు, ఆలయ ఈఓ గంగాధర్ ఆలయ అనువంశిక ధర్మకర్త వాసిరెడ్డి మురళి రాఘవ కుమార్ పర్యవేక్షణలో ఆలయ స్థానాచార్యులు ముదిగొండ శశాంక మౌళి ఆరాధ్య ఆలయ పురోహితులు సన్నిధానం కిషోర్ శర్మ ఆలయ ఉప ప్రధాన అర్చకులు దండిపట్ల బాలకృష్ణ శాస్త్రి, ముఖ్య అర్చకులు యడవల్లి సీతారామ ప్రసాద్ పవన్ కుమార్ ఆధ్వర్యంలో రథోత్సవానికి ముందు గా అన్న కుంభాభిషేకం విశేష అర్చనది పూజలు నిర్వహించారు, ఎస్ హెచ్ ఓ వైవి లచ్చునాయుడు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రథోత్సవంలో పోలీస్ సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు పర్యవేక్షణ చేశారు.

## గుడివాడ - కంకిపాడు రోడ్డు బాగు చేత కోసం వేసిన ప్రజావాజ్యాన్ని వెంటనే విచారణ జరపాలి



**గుడివాడ, మేజర్ న్యూస్:** గుడివాడ – కంకిపాడు రోడ్డు బాగు చేత కోసం వేసిన ప్రజావాజ్యం కేసు వెంటనే విచారణ జరపాలని కోరుతూ ప్రధాన న్యాయమూర్తికి పోస్టు కార్డుల ద్వారా వినతులు పంపే కార్యక్రమాన్ని భవిష్యత్ భద్రతా దళం మంగళవారం అక్కినేని నాగేశ్వరావు కళాశాలలో చేపట్టింది. ఈ కాలేజి విద్యార్దులు రోజూ ఈ రోడ్డు మీదనే ప్రయాణం చేస్తూ వుంటారు, ఆ రోడ్డు పై జరిగే ప్రమాదాలను సైతం వారు చూస్తూ ఉంటారు. దీంతో వాళ్ళకి ఈ రోడ్డు బాగు పడటం ఎంత అవసరమో అవగాహన వుంది. అందుకే వాళ్ళు ఎంతో బాధ్యతతో ముందుకు వచ్చి పోస్టు కార్డు ఉద్యమంలో పాల్గొనటం జరిగిందని భవిష్యత్ భద్రతా దళం వ్యవస్థాపకులు వైబీబీ మురళీ కృష్ణ తెలిపారు. విద్యార్థులు ఈ పోస్ట్ కార్డ్ ఉద్యమంలో పాల్గొనటానికి అనుమతులు ఇచ్చి సహకరించిన కాలేజి సెక్రటరీ కేవీస్ అప్పారావు, ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, ఉపాద్యాయులు వీఎన్. కుమార్, గోపి తదితరులకు భవిష్యత్ భద్రతా దళం తరుపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పోస్ట్ కార్డు ఉద్యంలో భద్రతా దళం సభ్యులు జి పూర్ణ చంద్రరావు, ఎండీ. తహేర్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

# చే జారుతున్న ఖ"నిజ" సంపద



**కట్టడి చేస్తే ప్రభుత్వ ఆదాయానికి ఊరట....**

**అక్కరకు రాని ఉచిత సరఫరా...**

**అడ్డదారుల్లో అక్రమార్కులకే పండుగ...**

**సియం చంద్రబాబు దృష్టి పెడితే సంపద సృష్టికి సపోర్టు...**

**ఇసుక పాలసీ పై ప్రభుత్వ పునః పరిశీలన అవసరం...**

**పామర్రు మాజీ ఎమ్మెల్యే డి.వై.దాస్ సూచన**

**పామర్రు ఫిబ్రవరి 11 మేజర్ న్యూస్:** ఆంధ్ర ప్రదేశ్ లో అపారమైన ఖనిజ సంపద కలదని అది సద్వినియోగం అయితే ప్రభుత్వ ఆదాయం పెరుగుతుందని అక్కరకు రాని విధంగా ఉచిత ఇసుక సరఫరా కనిపిస్తోందని పామర్రు మాజీ ఎమ్మెల్యే డి వై దాస్ పేర్కొన్నారు. ఉచిత ఇసుక పాలసీ తో అడ్డదారుల్లో అక్రమార్కులు పండుగ చేసుకుంటున్నారని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దీనిపై దృష్టి పెడితే సంపద సృష్టికి సపోర్ట్ అవుతుందని తెలుపుతూ ఇసుక పాలసీపై పునః పరిశీలన అవసరమని భావిస్తూ తన లేఖ ద్వారా సీఎం చంద్రబాబుకు డి.వై. దాసు సూచన చేశారు. ఆంధ్రప్రదేశ్ లో దాదాపు వెయ్యి కిలోమీటర్ల విస్తీర్ణంలో కృష్ణా నదీ పరివాహక ప్రాంతం వ్యాపించి ఉందన్నారు. ఈ ప్రాంతంలో అపారమైన ఖనిజ సంపద దాగి ఉందని, దీనిని సద్వినియోగం చేసుకోవడంలో ప్రభుత్వాలు విఫలమవుతూ వస్తున్నాయన్నారు. గత వైసిపి ప్రభుత్వం అదే విధంగా వ్యవహరించగా ప్రస్తుత ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఆ బాటలోనే నడుస్తోందన్నారు. ఇసుక సరఫరాకు ఉచిత పాలసీ అని పేరు పెట్టి ఆ పేరు మీద నదిలో ఇసుకనంతా అక్రమార్కుల పరం చేస్తున్నారన్నారు. ఇది ప్రభుత్వానికి తెలిసి చేసినా తెలియక చేసినా ప్రభుత్వ ఆదాయంకు మాత్రం చెప్పలేనంత గండి పడుతోందన్నారు. దీనిని ప్రక్షాళన చేయాల్సిన అవసరం అత్యవసరంగా కనిపిస్తోందన్నారు. అక్రమ సరఫరాను కట్టడి చేసి ప్రభుత్వ ఆదాయానికి ఊరట కలిగించాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం అమలుచేస్తున్న ఉచిత ఇసుక పాలసీని సామాన్య ప్రజానీకం 10 శాతం కూడా వినియోగించుకోవడం లేదన్నారు. ఈ నేపథ్యంలో విరామం లేకుండా రేయింబవళ్ళు జరుగుతున్న ఇసుక సరఫరా సొమ్ము ఎవరి జేబులోకి వెళ్తుందనేది ఇక్కడ ప్రశ్నగా ఉందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం ప్రభుత్వ ఇళ్ల నిర్మాణాలు జరగడం లేదు. గత ప్రభుత్వ పాలసీని రద్దు చేసి కొత్త పాలసీ ద్వారా ఇళ్ళ కేటాయింపులు, అలాగే యూనిట్ ధర పెంపు అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. పేదలు ఆ కొత్త పథకం అమలు కోసం ఎదురుచూస్తుండగా ఇతరులు అరకొరగా అక్కడక్కడా ఇళ్ళ నిర్మాణాలు జరుపుకుంటున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో ఉచిత ఇసుక సరఫరాకు పెద్దగా డిమాండ్ కానరావడం లేదన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఖాళీగా దర్శనమిస్తున్న ట్రాక్టర్లు, లారీలు ఇందుకు నిలువెత్తు నిదర్శనంగా ఉన్నాయన్నారు.

వాస్తవ పరిస్థితి ఇలా ఉంటే ఇసుక క్వారీల నుంచి రోజు రోజుకు తరలిపోతున్న టన్నులకొద్దీ ఇసుక ఎటువైపు వెళుతుందో తెలియాల్సి ఉందన్నారు. ఖచ్చితంగా ఇది అక్రమ రవాణా అనేది పబ్లిక్ టాక్ గా ఉందని, ప్రభుత్వం దీనిని తక్షణం కట్టడి చేయాల్సి ఉందన్నారు. ఇసుక పాలసీ ప్రవేశపెట్టి న మొదట్లో లోడింగ్ కు మిషన్ల వినియోగం నిషేధించారని అలాగే రవాణా కు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు మినహా లారీలు, టిప్పర్లు, ఇతర భారీ వాహనాలకు అనుమతి నిరాకరించారన్నారు. ఇప్పుడు ఆ షరతులు సన్నగిల్లిపోవడంతో లోడింగ్ కు మిషన్లు, రవాణాకు భారీ వాహనాలు రంగ ప్రవేశం చేసి వీటి ద్వారా అపారమైన ఖనిజ సంపద చేజారిపోతుందన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అప్పులు పై ఆధారపడాల్సి వస్తోందన్నారు. సంపద సృష్టించడానికి సానుకూల మార్గాలు అంతగా కానరావడం లేదని ఫలితంగా ప్రభుత్వ నడక తీవ్ర సతమతమవుతుందన్నారు. కృష్ణా నది ద్వారా లభించే అపార ఖనిజ సంపదను గాలికి వదిలేసి అప్పుల మీద ఆధారపడి ప్రభుత్వాన్ని నడపాలనుకోవడం నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవాన్ని ప్రశ్నిస్తున్నట్టుగా ఉందన్నారు. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకోవడానికి అనుకూలమైన మద్యం పాలసీని అమలు చేస్తున్నప్పుడు ఇసుకపాలసీని అదే దృష్టితో చూడకపోవడం లోపంగా ఉందన్నారు. పేదల ఇళ్ళ నిర్మాణాలకు మాత్రం ఉచిత ఇసుక పాలసీ అమలు చేసి మిగిలిన సరఫరా అంతా యూనిట్ ధర కేటాయిస్తే ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయల ఆదాయం రావడం ఖాయమన్నారు. ఈ విషయంలో ఎలాంటి సందేహం లేదన్నారు. 2014- 19 కాలంలో కూడా ఇదే వైఖరి అమలు చేయడం వల్ల అపుడూ ప్రభుత్వం ఇసుక సరఫరా లో అధిక ఆదాయాన్ని కోల్పోవాల్సి వచ్చిందన్నారు. మళ్ళీ అదే ఆనవాయితీ తాజాగా కొనసాగించడం ద్వారా అక్రమార్కులు లాభపడడం, అందరూ కుమ్మక్కై వాటాలు పంచుకోవడం మినహా ప్రభుత్వానికి చేకూరే ప్రయోజనం శూన్యంగా కనిపిస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వాస్తవ పరిస్థితిని అంచనా వేసి ముఖ్యంగా సీఎం చంద్రబాబు నాయుడు దీనిపై ప్రత్యేక దృష్టి సారించి ఉచిత ఇసుక పాలసీని పునః పరిశీలన చేయాల్సి ఉందన్నారు. లేదంటే గత ఫలితాలను మళ్లీ చవిచూడాల్సి వస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి కానరావడం లేదన్నారు. రాష్ట్ర విభజన తర్వాత కొత్త రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు నాయకత్వం కావాలని ఆశించి ఆయన్ను ఆంధ్రులు సీఎం చేశారన్నారు.ఇసుక పాలసీ, జన్మభూమి కమిటీలు వగైరా ప్రజలకు నచ్చని నిర్ణయాల వల్ల 2019లో 23 సీట్లకే అప్పటి అధికార టిడిపి పరిమితమైందన్నారు. వైసిపి అదే పరిస్థితిని చవి చూడాల్సి వచ్చిందన్నారు. ప్రజావ్యతిరేక విధానాలతో ఆ పార్టీ 11 సీట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చిన విషయం తెలిసిందే నన్నారు. ఈ పాఠాలు కూటమి ప్రభుత్వానికి గుణపాఠాలు కావాలన్నారు. మరోసారి ప్రజల వ్యతిరేకతను చవి చూడకుండా ఉండాలంటే చేజారుతున్న ఖనిజ సంపదను కట్టడి చేసి ఇసుక సరఫరా ద్వారా సంపద సృష్టికి శ్రీకారం చుట్టాలని డివైదాసు సూచించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మంగళవారం లేఖను పంపినట్టు డి.వై.దాసు తెలిపారు.

# నియోజకవర్గంలో ఓట్లను అభ్యర్ధించిన ఆలపాటి








**పామర్రు ఫిబ్రవరి 11 మేజర్ న్యూస్ :** కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ మంగళవారం పామర్రు నియోజకవర్గంలోని కళాశాలలు, కొన్ని పాఠశాలలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలోని పామర్రు, పమిడిముక్కల,మొవ్వ మండలాల్లో స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా, కూటమి నాయకులతో కలిసి ఆయన పర్యటించి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రగతి పథంలో రాష్ట్రాన్ని నడిపిస్తున్న చంద్రబాబుకు పట్టభద్రులు మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. తనకు ఓట్లు వేసి గెలిపించి శాసనమండలి కి పంపాలని తద్వారా పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈనెల 27న జరిగే పోలింగ్ లో ప్రతి పట్టభద్రుడు తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఆయన కోరారు. పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ ఉన్నత వ్యక్తిత్వం, మంచి అనుభవం గల ఆలపాటికి మద్దతుగా ప్రతి తెదేపా కార్యకర్త పని చేసి ఆయనకు మంచి మెజారిటీ తీసుకురావాలన్నారు. పామర్రు ఏఎన్ఎం ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లోను, పమిడిముక్కల మండలం తాడంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ ఉపాధ్యాయులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆలపాటి, కుమార్ రాజా, నాయకులు మాట్లాడుతూ పట్టభద్రులకు ప్రభుత్వం ఇచ్చే సంక్షేమాన్ని గురించి వివరించారు. తాడంకి హైస్కూల్లో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు కూడా పాల్గొన్నారు. ఈ పర్యటనలో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు గుండు శ్రీనివాసరావు, నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు నీలాయపాలెం విజయకుమార్, తెలుగుదేశం పార్టీ నాయకులు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, జక్కా శ్రీనివాసరావు, కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు వల్లూరుపల్లి గణేష్, జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇంచార్జి తాడిశెట్టి నరేష్, ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# రూ.20కోట్ల విలువైన పంచాయతీ స్థలం ఆక్రమణకు గురైంది



## గ్రామ సర్పంచ్ గండికోట సీతయ్య

**విజయవాడ మేజర్ న్యూస్ :** పైపులు రోడ్డుకు సమీపంలో గల విజయవాడ రూరల్ మండలం అంబాపురం పంచాయతీలోని ఎఫ్‌సీఐ ఎంప్లాయిస్ కో–ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ కాలనీలో రూ.20కోట్ల విలువైన పంచాయతీ స్థలం ఆక్రమణకు గురైందని గ్రామ సర్పంచ్ గండికోట సీతయ్య తెలిపారు. విజయవాడ ప్రెస్ క్లబ్లో గ్రామ అభివృద్ధి కమిటీ పెద్దలు, విజయవాడ రూరల్ మండలం టీడీపీ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ లే అవుట్‌లో కామన్ స్థలంగా వదిలిన 2,226 గజాల పంచాయతీ స్థలాన్ని రిటైర్డ్ అధికారి పి.జకరయ్య అనే వ్యక్తి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని చెప్పారు. అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నారని గ్రామ సర్పంచిగా అదేమని ప్రశ్నించిన తనపై పోలీసులను ఉపయోగించి జకరయ్య ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయించారని చెప్పారు. ఈ స్థలం విషయంలో స్థలాన్ని ఆక్రమించుకున్న రిటైర్డ్ అధికారికి మద్దతుగా నగరానికి చెందిన ఓ పోలీసు ఉన్నతాధికారి తనను బెదిరించారని వాపోయారు. వాస్తవానికి అది పంచాయితీ కి సంబంధించిన స్థలమని చెప్పారు. ఆ స్థలంలో తాగునీటి ట్యాంక్ నిర్మాణానికి గతంలోనే పంచాయతీ తీర్మాణం కూడా చేసిందని అయినా యథేచ్ఛగా కబ్జా చేశారని, ప్రజల పక్షాన నిలబడాల్సిన పోలీసు శాఖ ఉన్నతాధికారులు అక్రమ కేసులు పెట్టి, బెదిరింపులకు దిగటం అన్యాయం అన్నారు. నాలుగు దశాబ్దాల కిందట ఎఫ్‌సీఐ ఉద్యోగులు అంబాపురం పంచాయతీ పరిధిలో స్థలం కొనుగోలు చేసుకుని అప్పటి ఉడా అనుమతితో లే అవుట్ ఏర్పాటు చేశారని చెప్పారు. ఉడా నిబంధనల ప్రకారం సుమారు 5,000 గజాలను సామాజిక అవసరాల కోసం అంబాపురం పంచాయతీకి అప్పగించారని తెలిపారు. ఈ స్థలంలోని కొంత భాగంలో పార్కు ఏర్పాటు చేశారని, మరికొంత స్థలాన్ని గతంలో కొందరు కబ్జా చేయగా, హైకోర్టు ఆదేశాల మేరకు వారంతా ఖాళీ చేశారని వివరించారు. ఇప్పుడు మళ్లీ పుల్లా జకరయ్య అనే వ్యక్తి కొంతమంది పలుకుబడి నేతలతో కలసి కబ్జాకు పాల్పడ్డారని చెప్పారు. కాలనీ ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు క్రమంగా అభివృద్ధి చెందుతోందని, ప్రస్తుతం ఇక్కడ ఇళ్లు, అపార్ట్‌మెంట్లలో 3,500 వరకు కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. అయితే, ఈ కాలనీలో తాగునీటి వసతి లేదని చెప్పారు. వాటర్ ట్యాంక్ నిర్మించాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే స్పందించి వాటర్ ట్యాంక్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చారని చెప్పారు. ఇందులో భాగంగా పంచాయతీకి చెందిన 2,226 గజాల్లో రక్షిత మంచినీటి ట్యాంక్ నిర్మించాలని ఇటీవల పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసిందని చెప్పారు. అయితే, అనూహ్యంగా ఈ స్థలం తనదని రిటైర్డ్ అధికారి పి. జకరయ్య అనే వ్యక్తి ఫెన్సింగ్ వేయడం బాధాకరమన్నారు. జకరయ్య ఆరోపిస్తున్నట్లు స్థలం ఆయనది కాదని ఇందుకు సంబంధించిన డాక్యుమెంట్లు కూడా తమ వద్ద ఉన్నాయని చెప్పారు. పంచాయితీ స్థలాన్ని ఎట్టి పరిస్థితుల్లోను కబ్జా కానియమని స్పష్టం చేశారు. ఆ స్థలంలో గతంలో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్ల సైతం రద్దు చేయాలని సబ్ కలెక్టర్ నుంచి ఆదేశాలు ఉన్నాయని సంబంధిత ఆదేశిత పత్రాలను విలేకరులకు చూపారు. అయినప్పటికీ జకరయ్య 2024లో అక్రమంగా స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకుని గ్రామస్తులకు ఆ స్థలంలో మంచినీటి ట్యాంకు రాకుండా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ప్రశ్నించిన తనపై పోలీసులు తన పై అక్రమ కేసులు నమోదు చేశారని, గ్రామస్తులంతా ప్రశ్నిస్తున్నారని వారిపై కూడా కేసులు నమోదు చేస్తారా అంటూ ప్రశ్నించారు. దీని పై న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎస్ఎస్ నాయక్, కమిటీ నాయకులు వసంత్, చల్లగాని సునీల్, భాస్కరరావు, మోహన్ రావు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తిని రక్షించాలన్నారు. గ్రామస్తులకు మద్దతుగా టిడిపి కృష్ణా జిల్లా నాయకులు గుజ్జర్లపల్లి బాబురావు, జి నరసయ్య, కోనేరు సందీప్ తదితరులు మాట్లాడారు. విలేకరుల సమావేశం అనంతరం గ్రామస్తులంతా కలిసి నగర పోలీస్ కమిషనర్ కు, విజయవాడ రూరల్ మండలం తహసీల్దార్ కు గ్రామ పంచాయతీకి చెందిన స్థలాన్ని కబ్జా కాకుండా రక్షించాలని వినతి పత్రాలు అందజేశారు.



## నందిగామ అబ్బాయి... అమెరికా అమ్మాయి...

### ఖండంతరాలు దాటిన మూడు సంవత్సరాల ప్రేమ...

### ఇరు కుటుంబాలు ఒప్పుకోవడంతో ఒకటైన వైనం...

**నందిగామ, ఫిబ్రవరి 11, మేజర్ న్యూస్:** పట్టణానికి చెందిన దూలాస్ విద్యా సంస్థల అధినేత పగిడిపల్లి దేవ సహాయం ఉషారాణి దంపతుల కుమారుడు మణి డాక్టర్ చదివేందుకు యూఎస్ఏ వెళ్ళాడు. ఈ క్రమంలో అక్కడ యాంబర్ అనే యువతితో పరిచయం ఏర్పడగా ఆ పరిచయం కాస్త ప్రేమగా మారి మూడు సంవత్సరాల ప్రేమ అనంతరం ఒకరిని ఒకరు అర్థం చేసుకుని కుటుంబ పెద్దల అంగీకారంతో సోమవారం రాత్రి ఇరు కుటుంబాల సమక్షంలో ఒకటయ్యారు.మొదట ఇండియన్ క్రిస్టియన్ సాంప్రదాయం ప్రకారం అనంతరం అమెరికన్ క్రిస్టియన్ సాంప్రదాయ ప్రకారం వధువు తల్లిదండ్రులు డేవిడ్ బెత్ వారి కుటుంబ సభ్యుల సమ్మతమున వివాహం అంగరంగ వైభవంగా జరిపించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పట్టణ ప్రముఖులు, దైవజనులు, వివిధ రంగాల ప్రముఖులు తదితరులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా పండిత్ దీనదయాల్ వర్ధంతి



**నందిగామ, ఫిబ్రవరి 11, మేజర్ న్యూస్:** భారతీయ జనతా కార్యాలయంలో బిజెపి పార్టీ సిద్ధాంతమైన ఏకాత్మ మానవతా వాదం అంత్యోదయను ప్రవచించిన గొప్ప భారతీయ తత్వవేత్త రాజకీయ శాస్త్రవేత్త చరిత్రకారుడు జన సంఘ వ్యవస్థాపకులు "పండిట్ దీనదయల్"ఉపాధ్యాయ వర్ధంతిని పురస్కరించుకుని వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు మునగంటి కామేశ్వరరావు జిల్లా అధికార ప్రతినిధి కేదార్నాథ్ శర్మ అసెంబ్లీ కో– కన్వీనర్ చిరుమామిళ్ల శ్రీనివాసరావు జిల్లా ఓబీసీ మోర్చా లక్ష్మణ్ గోనెల సత్యనారాయణ ముక్కుపాటి నరసింహారావు మురుమూరు నరసింహారావు బుర్ర వెంకటరావు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల భవితవ్యం ప్రశ్నార్ధకం ?



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** ఒక టీచర్, ఆయా, మధ్యాహ్న భోజన ఏజెన్సీ. పెద్ద పెద్ద ఆవరణలు, 2 నుండి 6 గదులుగల అంతస్థుల పాఠశాల భవనాలు. అన్నివసతులతో అలరారుతున్నాయి. కానీ ఆ పాఠశాలల్లో పట్టుమని 10 మంది విద్యార్థులు లేరు. అలాంటి పాఠశాలలు గుడ్లవల్లేరు మండలంలో 15 వరకు వున్నాయి. కిలో మీటరు లోపున్న ఉన్నత పాఠశాలల్లో 3 నుండి 5 తరగతులు విలీనం కావడం, కొన్ని గ్రామాల్లో విద్యార్థులు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు వెళ్ళడం కారణాలుగా కనిపిస్తున్నాయి. దీంతో రాబోయే విద్యా సంవత్సరంలో ఆ పాఠశాలల భవిష్యత్తు ప్రశ్నార్థకం కానుంది. దీంతో ఆయా పాఠశాలల ప్రాంతాల్లో డ్రాపవుట్స్ పెరిగే సూచనలున్నాయి. అలాగే తల్లిదండ్రులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో అన్ని వసతులతో కూడిన పెద్ద భవంతి కల పద్మాలపాలెం ప్రాథమిక పాఠశాలలో ఒకే ఒక్క విద్యార్థి, విద్యాబుద్ధులు చెప్పడానికి ఒక టీచర్, ఆలనాపాలనా చూసుకోడానికి ఒక ఆయా, మధ్యాహ్న భోజనం వండిపెట్టడానికి ఒక మహిళ ఉన్నారు. అలాగే రెండు అంతస్థుల కౌతరం సోషల్ వెల్ఫేర్ ప్రాథమిక పాఠశాల భవనంలో 9 మంది విద్యార్థులు. పెద్ద ఆవరణ, 3 భవనాలు, 6 తరగతి గదులు, 6 టాయిలెట్స్ కలవు. కౌతరం మెయిన్ ప్రాథమిక పాఠశాలలో 5 విద్యార్థులు. గాదేపూడి ప్రాథమిక పాఠశాలలో 3 మంది, ఉలవలపూడి పాఠశాలలో 5 మంది, చినగొన్నూరు, తాడిచర్ల, పెంజంద్ర పాఠశాలల్లో 6మంది, కొండిపాలెం, తురాయిపాలెం, పెంజెంద్ర(ఉర్దూ) పాఠశాలల్లో 7 మంది, చిత్రం, లంకాదొడ్డి, విన్నకోట(మెయిన్), వడ్లమన్నాడు (మెయిన్) పాఠశాలల్లో 8 మంది చొప్పున విద్యార్థులు, ఒక టీచర్, ఒక ఏజెన్సీ మహిళ ఉన్నారు.

## సిఎస్ఐ చర్చిలో మండల పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం

**నందిగామ, ఫిబ్రవరి 11, మేజర్ న్యూస్:** వీరులపాడు మండలం పాస్టర్స్ ఫెలోషిప్ సీఎస్ఐ చర్చిలో దైవజనులు పి. ఆశీర్వాదం వద్ద నిర్వహించారు. ఈ సభలో పాస్టర్ పి. పిటర్ దేవుని వాక్యన్ని క్రైస్తవ పోరాటాలు గూర్చి భోదించారు.దేశ క్షేమం,రాష్ట్ర క్షేమము కొరకు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. మండల పాస్టర్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ బి. యస్ పాల్ పాస్టర్స్ ను దేశించి ఐక్యత గురించి తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ నాయకులు, ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సమావేశంలో వైస్–ప్రెసిడెంట్ పి.సీయోను కుమార్, ట్రెజరర్ మందా స్వామి దాసు,ఇమ్మానుయేలు,సెక్రటరీ సంసోను, అడ్వైజర్ యేసుదాసు, జయరాజ్, సామ్యేలు పాల్గొన్ని దేవుని మహిమ పరిచారు.

## 60 లక్షలతో ఘంటసాల కచేరి హాల్ నిర్మాణానికి ప్రణాళికలు



**ఘంటసాల, మేజర్ న్యూస్:** మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు గానాంమృతం తెలుగువారి హృదయాల్లో సుస్థిరమని జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ తెలిపారు. మంగళవారం ఘంటసాల లో మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 51 వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఘంటసాల పి హెచ్ సి వైద్యాధికారి డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్, ఘంటసాల కళా సమితి కార్యదర్శి పోతన వెంకటేశ్వరావు, ప్రముఖ రేడియో ఆర్టిస్ట్ బలే వెంకటేశ్వరరావు,తదితర ప్రముఖులతో కలిసి వెంకటరామ కృష్ణ స్వాతంత్ర్యసమరయోధుడు ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ మాట్లాడుతూ ఘంటసాల వెంకటేశ్వరరావు పూర్వీకుల జన్మస్థలం ఘంటసాల అని ఆయన 1967 ఏప్రిల్ 21న సంత మార్కెట్ సమీపంలో మూడు గంటల పాటు పాటల కచేరి నిర్వహించారని కొనియాడారు. దీనికి గుర్తుగా 2027 సంవత్సరానికి గాయక ఘంటసాల వెంకటేశ్వరరావు గానకచేరి చేసి 60 ఏళ్ళు పూర్తి అవుతున్న సందర్భంగా రూ.60 లక్షలతో ఘంటసాల వెంకటేశ్వరరావు కచేరి హాల్ నిర్మాణం కొరకు పథకాలు రూపొందిస్తున్నట్లు వెంకట రామకృష్ణ తెలిపారు. ఘంటసాల వెంకటేశ్వరరావు తన గానం తో తెలుగు భాషను దశదిశల చాటారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ ప్రముఖులతో పాటు వైద్య సిబ్బంది కృష్ణ, శివ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# 25 ఏళ్లుగా చెక్క ఫర్నిచర్ తయారీ రంగంలో ఇండియావుడ్ 2025 నూతన ఆవిష్కరణలు

**విజయవాడ, ఫిబ్రవరి 11, మేజర్ న్యూస్ :** అగ్రగామి వృత్తి పనులు, ఫర్నిచర్ తయారీ ప్రదర్శన ఇండియావుడ్ 2025 ఇండియా ఎక్స్‌పో మార్కెట్, సెంట ర్ (ఐఈఎంఎల్), గ్రేటర్ నోయిడా, ఢిల్లీలో మార్చి 6 నుంచి 9వ తేదీలలో జరుగనుంది. ప్రపంచవ్యాప్త వృత్తి పనుల పోర్ట్‌ఫోలియోలో భాగమైన ఈ ప్రత్యేకమైన మైల్‌స్టోన్ ఎడిషన్, ఇండియాను ఒక తయారీ శక్తిగా, వృత్తి పనులు, ఫర్నిచర్ రంగంలో ఒక ముఖ్యమైన ప్రపంచ నాయకుడిగా వెలుగు చూస్తున్న దిశగా ప్రతిబింబిస్తుంది. ఇండియావుడ్ తన ప్రారంభం నుండి వృత్తి పనుల, ఫర్నిచర్ తయారీ రంగాల విస్తరణలో కీలక పాత్ర పోషించింది. ప్రొడ్యూసర్లు, సరఫరాదారులు, సాంకేతిక నిపుణులు, వృత్తి పరిశ్రమ ప్రొఫెష నల్స్‌ని ఒక వేదికపై ఇస్తున్న ఈ ప్రదర్శన గత రెండు, అంగడిన దశాబ్దాల్లో సాంకేతిక అభివృద్ధులు, సస్టైనబుల్ ప్రాక్టీసెస్, ప్రపంచ స్థాయి సహకారాలను పునరుద్ధరించింది. ప్రస్తుతం భారత్ ప్రపంచంలో మొదటి ఐదు ఫర్నిచర్ తయారీదారులలో ఒకటిగా ఉందని, ఫర్నిచర్ ఎగుమతుల సాధారణం 20% పెరుగుతున్నట్లు సూచిస్తుంది. 2025లో భారత ఫర్నిచర్ మార్కెట్ విలువ యుఎస్‌డి 25.75 బిలియన్ అని అంచనా వేయబడింది, 2030లో ఇది యుఎస్‌డి 37.18 బిలియన్ వరకు చేరుకోవచ్చు. 62% మగ్గింగ్ ఆధారిత ఫర్నిచర్ తయారీతో, ఈ రంగం ఆవిష్కరణ, సస్టైనబిలిటితో మెరుగుపడు తోంది – ఇందులో చాలా భాగం ఇండియావుడ్‌అందించిన అవకాశాల వల్ల," అని సోనియా ప్రసార్, న్యూర్న్‌బర్గ్‌మెస్సే ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ చెప్పారు. న్యూర్న్‌బర్గ్‌మెస్సే ఇండియా గ్రూప్ డైరెక్టర్ శివకుమార్ వెన్నుగోపాల్ మాట్లాడుతూ "ఇండియావుడ్25 సంవత్సరాల సంభావన, అది మన దేశంలో వేగంగా మారుతున్న వృత్తి పనుల, ఫర్నిచర్ తయారీని ప్రదర్శించేలా మారింది. వృత్తి పనుల పరిశ్రమలో స్వతంత్రత, ఆవిష్కరణలు ప్రోత్సహించడంలో ఇండియావుడ్‌ముందు నిలబడింది." "2025 లో ఈ మైల్‌స్టోన్ ఉత్సవాన్ని జరుపుకుంటున్నప్పుడు, మేము ఈ పరిశ్రమల భవిష్యత్తు కోసం అవసరమైన పరిష్కారాలను అందించటానికి, ప్రపంచవ్యాప్తంగా వ్యాపార సహకారాలను ఏర్పరచడానికి, ఈ పరిశ్రమలను పెంచడానికి ప్రతిబద్ధత ప్రకటిస్తున్నాం," ఆయన తెలిపారు. ఇండియావుడ్‌గురించి మరిన్ని వివరాలు, రిజిస్ట్రేషన్, ప్రదర్శన గణన వివరాలు, ఈవెంట్ అప్డేట్స్ కోసం www.indiawood.comను సందర్శించండి.

# మరణించినా.. ముగ్గురికి ప్రాణం పోశాడు



**రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కోటేశ్వరరావు**

**కాపాడేందుకు తీవ్రంగా శ్రమించిన కామినేని హాస్పిటల్స్ వైద్యులు**

**అవయువ దానానికి అంగీకరించి ఆదర్శంగా నిలిచిన మృతుడి కుటుంబసభ్యులు**

**గ్రీన్ ఛానల్ ద్వారా అవసరమైన చోటుకు అవయువాల తరలింపు**

**మరో ముగ్గురి ప్రాణాలను నిలబెట్టిన అవయువ దానం**

**విజయవాడ మేజర్ న్యూస్ :** తాను మరణిస్తూ మరో ముగ్గురికి ప్రాణం పోసిన ఓ వ్యక్తి.. ఎంతో మందికి ఆదర్శంగా నిలిచాడు. అవయవ దానం ద్వారా ముగ్గురికి పునర్జన్మనిచ్చి చిరంజీవి అయ్యాడు. ఈ నెల 5న కృష్ణాజిల్లాలో బంటుమల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బుద్దన కోటేశ్వరరావు (54) తీవ్రగాయాలపాలయ్యారు. ప్రమాదంలో స్పృహ కోల్పోయిన కోటేశ్వరరావును చికిత్స నిమిత్తం తాడిగడపలోని కామినేని హాస్పిటల్స్‌కు తీసుకొచ్చారు. కామినేని హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ పేషెంట్ బ్రెయిన్ డెడ్ అయినట్లుగా వైద్యులు నిర్ధారించారు. మరణించిన తమ కుటుంబసభ్యుడిని చిరంజీవిగా నిలపాలనే కామినేని హాస్పిటల్ వైద్యుల సలహామేరకు సత్ సంకల్పంతో కోటేశ్వరరావు కుటుంబసభ్యులు అవయువ దానానికి అంగీకరించారు. జీవన్ దాన్ నిబంధనల మేరకు కిడ్నీలు (మూత్రపిండాలు), లివర్ (కాలేయం) సేకరించిన కామినేని వైద్యులు.. గ్రీన్ ఛానల్ ద్వారా అవసరమైన చోట్లకు తరలించారు. కామినేని క్లస్టర్ హెడ్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో న్యూరో సర్జన్ డాక్టర్ ఉయ్యూరు శ్రీధర్, డాక్టర్ రాంబాబు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు. మహోన్నత నిర్ణయంతో మరెందరికో ఆదర్శంగా నిలిచిన కోటేశ్వరరావు కుటుంబసభ్యులకు ప్రజలు జేజేలు పలుకుతున్నారు.

# వ్యర్థాల సేకరణలో ఎటువంటి జాప్యం ఉండరాదు

**కమిషనర్ ధ్యాన చంద్ర ఆదేశాలు**





**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** వ్యర్థాల సేకరణలో ఎటువంటి జాప్యం ఉండరాదని, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తుండాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం తన పర్యటనలో భాగంగా శిఖామణి సెంటర్, బడవపేట, వుడ్ పేట, గుణదల ప్రాంతాలని పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతిరోజు వ్యర్థాలను కచ్చితంగా సేకరించాలని, రోడ్డుపైన ఉన్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు ట్రాక్టర్లలో గార్బజ్ ట్రాన్సర్ స్టేషన్లకు తరలించాలని, పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండకూడదని అధికారులను ఆదేశించారు. నగరంలో ఉన్న అన్ని మరుగుదొడ్లను మరమ్మతులు చేయించాలని, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని, మరుగుదొడ్లలో నీటి సరఫరా, బకెట్లు తదితర సౌకర్యాల కల్పనలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని వాటర్ ట్యాంక్ వద్ద నమ్మ టాయిలెట్లను పరిశీలించి అధికారులను ఆదేశించారు. అంగరంగ వైభవంగా జరుగుతున్న గుణదల మేరీమాత ఉత్సవాలలో విజయవాడ నగరపాలక సంస్థ వారు కల్పిస్తున్న సౌకర్యాలలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని నిరంతరం పారిశుధ్య నిర్వహణ, అధికారుల పర్యవేక్షణలో జరగాలని తాగునీటి సరఫరాలో భక్తులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ సిటీ ప్లానర్ జీవి జీఎస్ వి ప్రసాద్, ఇంచార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెంటింగ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్) పి సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి సామ్రాజ్యం, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఆధార్ అప్‌డేట్‌కు ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టండి..





**శిశు ఆధార్‌పైనా ప్రత్యేకంగా దృష్టిసారించాలి**

**ఆసుపత్రుల్లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలి**

**ఆధార్ పర్యవేక్షణ కమిటీ సమావేశంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 11, మేజర్ న్యూస్ :** అయిదేళ్లకు పైబడిన పాఠశాల విద్యార్థులు, 15 ఏళ్లకు పైబడిన ప్రభుత్వ, ప్రైవేటు, రెసిడెన్షియల్ కళాశాలల విద్యార్థులు తప్పనిసరిగా ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేషన్ చేయించాల్సి ఉంటుందని, ఇందుకు ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జిల్లాస్థాయి ఆధార్ పర్యవేక్షణ కమిటీ (డీఎల్ఏఎంసీ) సమావేశం జరిగింది. రెవెన్యూ, విద్య, వైద్య ఆరోగ్యం, ఐసీడీఎస్, మునిసిపల్ తదితర శాఖల అధికారులు సమావేశంలో నేరుగా పాల్గొనగా యూఐడీఏఐ రీజనల్ కార్యాలయ అసిస్టెంట్ మేనేజర్ జి.గిరిధర్ వర్చువల్‌గా హాజరయ్యా రు. జిల్లాలో ఆధార్ నమోదు స్థితిగతులు, ఆధార్ కేంద్రాల పనితీరు, ఆధార్ నమోదుకు ధ్రువీకరణ పెండెన్సీ, శిశు ఆధార్ తదితరాలపై చర్చించారు. అయిదేళ్లకు పైబడిన, 15 ఏళ్లకు పైబడిన విద్యార్థులు ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేషన్ చేయించుకోవడం వల్ల భవిష్యత్తులో నీట్, జేఈఈ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు హాజరైన సందర్భంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటుందని తెలిపారు. మ్యాన్యువల్ రెసిడెన్స్ సర్టిఫికేట్‌కాకుండా ఇంటిగ్రేటెడ్/జనన/కమ్యూనిటీ/నేటివిటీ సర్టిఫికేట్ ద్వారా ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. ఈ విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు.

ఆసుపత్రిలో పుట్టిన వెంటనే ఆధార్ రిజిస్ట్రేషన్‌కు చర్యలు తీసుకోవాలని.. ఈ విషయంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు ఆసుపత్రుల్లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆధార్ నమోదుకు జనన ధ్రువీకరణ సర్టిఫికేట్ అవసరం కాబట్టి త్వరితగతిన సర్టిఫికెట్ జారీకి చర్యలు తీసుకోవాలన్నారు. బర్త్ సర్టిఫికేట్ లేని చిన్నారులను గుర్తించి, బర్త్ రిజిస్ట్రేషన్ చేయించుకునేలా అంగన్వాడీ కార్యకర్తలు కృషిచేయాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్, గ్రామ, వార్డు సచివాలయాల అధికారులు పారదర్శక, దోషరహిత ఆధార్ విషయంలో సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. సమావేశంలో జిల్లాస్థాయి ఆధార్ పర్యవేక్షణ కమిటీ కన్వీనర్, గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, డీసీపీ కేజీవీ సరిత, డీఈవో యూవీ సుబ్బారావు, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, ఎల్‌డీఎం కె.ప్రియాంక విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, ఐసీడీఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వైద్య ఖర్చుల నిమిత్తం గద్దె క్రాంతి ఆర్థిక సహాయం



**విజయవాడ మేజర్ న్యూస్ :** 3వ డివిజన్ కు చెందిన దేవరాజు గట్టు గాయత్రి అనే మహిళకు యాక్సిడెంట్ అయి నడవలేక ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ఆమెకు వైద్య ఖర్చుల నిమిత్తం గద్దె క్రాంతి కుమార్ రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. మంగళవారం ఉదయం కామినేని నగర్‌లోని దేవరాజుగట్టు గాయత్రి ఇంటికి గద్దె క్రాంతి కుమార్ వెళ్ళి పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం రూ 10,000 ఆర్థిక సహాయాన్ని ఆమెకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గద్దె రమేష్, తాడి బాబురావు, గుంజి ఏసుబాబు, రాజనాల సురేష్, కోటి రెడ్డి, గుణమాల రాజశేఖర్, పొట్లూరి దర్శిత్ తదితరులు పాల్గొన్నారు.

## లైలా సినిమాను ఆదరించండి

**అవనిగడ్డలో హీరో విష్వక్ సేన్ సందడి**



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రముఖ యువ సినీ హీరో విష్వక్ సేన్ అవనిగడ్డలో సందడి చేశారు. ఈ నెల 14వ తేదీ తాను హీరోగా నటించిన లైలా సినిమా ప్రమోషన్ కోసం వచ్చిన విష్వక్ సేన్ ఎస్.వీ.ఎల్ క్రాంతి కళాశాలలో మంగళవారం సందడి చేశారు. అవనిగడ్డలో హీరో విష్వక్ సేన్‌కు ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, ఎస్.వీ.ఎల్ క్రాంతి విద్యాసంస్థల చైర్మన్ దుట్టా ఉమా మహేశ్వరరావు ఘన స్వాగతం పలికారు. హీరో విష్వక్ సేన్ రాక సందర్భంగా విద్యార్థులు బాణాసంచాతో స్వాగతం పలికారు. విద్యార్థినీ విద్యార్థులు భారీ కేరింతలు కొడుతూ ఆయనకు ఘన స్వాగతం పలికారు. లైలా చిత్రాన్ని ఆదరించాలని విష్వక్ సేన్ కోరారు. ఆయన వెంట మచిలీపట్టణం ఎంపీ వల్లభనేని బాలశౌరి తనయుడు వల్లభనేని అనుదీప్, మచిలీపట్నం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి బండి రామకృష్ణ తనయుడు బండి విజయ్ ఉన్నారు.

## మధ్యాహ్న భోజనం పరిశీలన



**ఏ.కొండూరు. మేజర్ న్యూస్ :** మండలంలోని పాత రేపూడి గ్రామంలో ఎలిమెంటరీ పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో సిహెచ్ చిన్న రాట్నాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మెనూ ప్రకారంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తుందని వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తపరిచారు.


18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు **ఎన్.వెంకట్,** ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో

ఫోన్ : 9642 980 999